గిలిగింతలు పెట్టే **గిరిజ**

ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

జనవరి 10, 2016

ముత్యాల ముంగిట్లో
రత్నాల రంగవల్లులు

‘హృ’దయం మిల్ గయా...

హృతిక్‌ది ఏ, బీ, సీల్లో ఏ క్లాస్? హెచారెక్స్ టీనేజర్లు, ఫ్యామిలీలు, చిన్నారుల్లో ఎవరికి ఆరాధ్యుడు? క్రిష్‌ది లవ్, కమర్షియల్, సై-ఫై, క్లాసికల్‌లో ఏ కేటగిరీ? చెప్పడం చాలా కష్టం. అతడు అందరి హృదయాలను కొల్లగొట్టేశాడు. ఏ జోనర్‌కైనా జీవం తెచ్చేస్తాడు. ఏ క్లాస్‌నైనా మెప్పిస్తాడు. డ్యాన్సులు, స్టంట్‌లే కాదు. అద్వితీయ నటనతో స్టార్‌లైన అరుదైన నటుడు. హృతిక్ మేనియా దేశాన్ని ఊపేసి 15 ఏళ్లు అవ్వొస్తుంది. హృతిక్ ఇక ‘ఫినిష్డ్’ అంటూ అచ్చేసిన కథనాలు వచ్చి పదేళ్లు కావొస్తోంది. తత్తరపాటు మాటలు, బక్కపల్చటి గెడకర్ర శరీరం, మాటిమాటికీ వేధించే అనారోగ్యం దాటేసి గ్రీక్ గాడ్ హోదాకొచ్చేశాడు. వెన్ను, మెదడు సర్జరీలు పూర్తయి యాక్షన్ స్థాయి పెంచేశాడు. వ్యక్తిగత జీవితంలో గుండెకు గాయాలైనా ఇటీవలే తల్లి జన్మదినాన్ని ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నాడు. ఇదంతా ఎందుకంటే ఈ రోజు దుగ్గు 42వ పుట్టిన రోజు.

- ఆరేళ్లప్పుడే హృతిక్ ‘ఆశా’ అనే సినిమా ద్వారా తెరకు పరిచయమయ్యాడు. రజనీకాంత్, శ్రీదేవి కాంబినేషన్లో 1986లో వచ్చిన ‘భగవాన్ దాదా’ చిత్రంలో పూర్తిస్థాయి పాత్ర వేశాడు.
- పంజాబీలైన హృతిక్ కుటుంబం వెనుకటి రెండు, మూడు తరాలు అటు తల్లివైపు, ఇటు తండ్రి వైపు కూడా అంతా కళాకారులే. నటులూ, సంగీతకారులూ, దర్శకనిర్మాతలే. అంత మాత్రాన హృతిక్ హీరో ఎంట్రీ తేలిక కాలేదు. ఫిల్మ్ మేకర్ అయ్యేందుకు చిత్ర నిర్మాణంలోని అన్ని క్రాఫ్ట్స్‌లో ఆరితేరాడు. సెట్‌లో నేలకు తడి గుడ్డ వేయడం దగ్గర నుంచి అందరికీ చాయ్ పెట్టి అందించే బాయ్‌లా కూడా పనిచేశాడు.
- సినిమాల కోసం ప్రఖ్యాత యూసీఎల్ఏ విశ్వవిద్యాలయం నుంచి అందిన మాస్టర్స్ డిగ్రీ స్కాలర్‌షిప్ సీటును వదులుకున్నాడు.
- తండ్రి రాకేశ్ రోషన్ దర్శకత్వంలో వచ్చిన తొలి చిత్రం ‘కహో నా... ప్యార్ హై’ (2000)తోనే సూపర్ స్టార్‌డమ్ వచ్చేసింది. ఇంకా నిలదొక్కుకోకుండానే తీవ్ర పరాజయాలు వరసగా ఎదురయ్యాయి. హృతిక్ పని అయిపోయిందని కవర్‌స్టోరీలు వచ్చాయి. అయితే ఎవరూ ఊహించనట్టు, అసలు పట్టించుకోనట్టు ‘కోయీ మిల్ గయా’తో ప్రపంచాన్ని స్టన్ చేశాడు. సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో వచ్చిన తొలి భారతీయ సూపర్ హిట్ సినిమా. అదీ గ్రహాంతర జీవిపై అల్లిన కథ నేపథ్యంలో.
- హృతిక్ కుడి చేతికి రెండు బొటన వేళ్లుంటాయి. దీన్ని శస్త్రచికిత్స ద్వారా తొలగించుకోవచ్చు. కానీ దాన్నో లోపంగా హృతిక్ చూడలేదు. పైపెచ్చు ‘కోయీ మిల్ గయా’ చిత్రంలో ఏలియన్ పాత్ర ‘జాదూ’కి కూడా అలానే. అందం మన ఆలోచనది అంటాడు.
- ధూమ్, అగ్నిపథ్, బ్యాంగ్ బ్యాంగ్‌ల యాక్షన్ హీరోనే కాదు, గుజారిష్, జోధా అక్బర్ చిత్రాల గొప్ప నటుడు కూడా. క్రిష్ గురించి వేరే చెప్పాల్సింది లేదు. ఓ కామిక్ హీరోగా ప్రపంచమంతటా అభిమానుల్ని దక్కించుకున్న ఒకే ఒక్క భారతీయ హీరో.
- లండన్, వాషింగ్టన్‌లోని మేడమ్ టుస్సాడ్స్‌లో మైనపు ప్రతిరూపాన్ని ఏర్పాటు చేసిన 5వ భారతీయ ప్రముఖుడు. హాలీవుడ్ అందాల తార బార్బరా మోరీతో 2010లో చేసిన ‘కైట్స్’ చిత్రం ఆ ఏడాది యూఎస్ టాప్ టెన్ లిస్టులో స్థానం పొందింది.
- హృతిక్ పిల్లల పేర్లు హృహాన్, హృదాన్. ‘హృ’ అనే శబ్దం అంటే చాలా ఇష్టం మరి. చిన్నారులకు హృతిక్ పెద్ద అభిమాని. యునిసెఫ్ బ్రాండ్ అంబాసిడర్‌గానే కాక ఎన్నో సేవా కార్యక్రమాల్లో ముందుంటాడు.
- 21 ఏళ్లపుడు ఓ స్టంట్ చేస్తూ గాయపడినపుడు వెన్ను ‘ఎస్’ ఆకారంలోకి మెలితిరిగిపోయింది. దీన్నే స్కాలియోసిస్ అంటారు. హృతిక్ స్ప్రింగ్ డ్యాన్సులు కాదు కదా ఇక అడుగు కూడా వేయలేడని అన్నారు. కానీ ఇప్పుడు అతడో డ్యాన్స్ ఐకాన్.
- ‘బ్యాంగ్ బ్యాంగ్’ చిత్రంలో మరో స్టంట్ చేస్తూ ఎత్తు నుంచి పడిపోయాడు. ఈసారి మెదడుకు శస్త్ర చికిత్సచేశారు. చనిపోతాడేమో అనే వార్తలకు బ్రేక్ ఇచ్చి మళ్లీ స్టంట్లు, డ్యాన్సులతో మోత మోగిస్తున్నాడు.
- ప్రస్తుతం అశుతోష్ గోవారికర్ దర్శకత్వంలో వస్తున్న చారిత్రాత్మక ‘మొహంజొదారో’ చిత్ర షూటింగ్‌లో భాగంగా ఇసుక తుఫాన్ల మధ్య భారీ యాక్షన్‌ను చేస్తున్నాడు.
- ఒకప్పుడు హృతిక్‌వన్నీ బలహీనతలే కానీ వాటన్నింటినీ దాటేసింది మనో బలంతోనే. ఐదేళ్లలో తనలోని బలవంతుడు ఎలా ఉండేది ఊహించుకుంటూ తనకు తానే స్ఫూర్తి పొందుతుంటాడు. హృతిక్‌కు ఓ కల తరచూ వచ్చేది. ఎవరో పొడవాటి జుట్టుతో ఉన్న ఓ సూపర్ హీరో కొండవాలున నిల్చుని తన వైపు చేతిని ఊపుతున్నట్టుగా. ఆ సూపర్ హీరోనే క్రిష్‌గా అయిపోయాడు . హృతిక్ అంతటి పాజిటివ్.

★

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

అల్లుడుగారు

సంక్రాంతి! ప్రతి ఏడాది వచ్చి పలకరించే మొదటి పెద్ద పండగ! దీని రాక పోక రెండూ ఘనమే. వచ్చిన ప్రతి సారీ సంవత్సరం మొత్తానికి సరిపడా జ్ఞాపకాలు మిగిల్చి వెళ్లడం ఈ పండగ ప్రత్యేకత. నెల రోజుల ముందు నుంచే ఇళ్లకు పండగ కళ వచ్చేస్తుంది... రకరకాల రంగవల్లుల రూపంలో. ఎక్కడెక్కడో దూర తీరాల్లో ఉద్యోగాలు, పనిపాటలు చేసుకునే వారు సైతం పుట్టిళ్లకు, సొంతూళ్లకు ప్రయాణమౌతారు. ఈ సందర్భంగా అల్లుళ్లకు ప్రత్యేక పిలుపులు, ఏర్పాట్లు వుంటాయి. ఇక అరిసెలు, చక్కలు, చక్రాల వంటి పిండివంటల ఘుమఘుమలు రాని ఇల్లుండదంటే అతిశయం కాదు. పలకరింపుగా ఎవరింటికి వెళ్లినా ప్రేమగా వీటినే పెట్టినా ... వాటి తయారీలో ఎవరి శైలి వారిది. ఎవరి రుచి వారిది. అందుకే ఎన్ని తిన్నా మొహం మొత్తదు.

ఈ పండగ ఎపిసోడ్‌లో అల్లుళ్లదే హవా. అల్లుళ్లకు అల్లుళ్లు వచ్చినా వారి హోదాలో ఎలాంటి మార్పు వుండదు. రాదు కూడా. సీనియర్ అల్లుళ్లు మరి. అల్లుడిగా ఇంట్లో అడుగెట్టిన దగ్గర నుంచి అల్లుడి యాంగిల్‌లోనే ఏర్పాట్లు జరిగిపోతుంటాయి. కూర వండాలన్నా, టిఫిన్ చేయాలన్నా, పిండి వంటలు వండాలన్నా, పండగ బట్టలు పెట్టాలన్నా... ఏదైనా సరే... అల్లుడిగారి ఇష్టాయిష్టాలేంటో ఆరా తీసి... వారి మనసుకి నచ్చే... మెచ్చే పద్ధతుల్లో ఏర్పాట్లు చేసేస్తుంటారు. ఇవనే ఏముంది! ఇంటి అలంకరణ సైతం అల్లుడిగారి అభిరుచికి ప్రతిబింబంగానే వుంటంది. ఉబుసు పోక టీవీ చూసినా అల్లుడిగారికి ఇష్టమైన చానలే. సినిమాలే. సీరియళ్లే... మిగతావారూ చూడాలి. ఇక వండిన వాటిలో మొదట అల్లుడిగారికి ప్రత్యేకంగా తీసి పక్కన పెట్టాలి. మరి అడుగూ బొడుగూ పెడితే బాగోదు కదా. ఇదని అదనేముంది! మొత్తంగా ఇంటి వాతావరణాన్నే శాసించేస్తాడు అల్లుడుగారు.

◆ మనలో మాట

దశమగ్రహంగా వినతికెక్కిన అల్లుళ్లు ఎన్ని ఆగడాలు చేసినా బయటికి పొక్కకుండా చూసుకోవడంలో అత్తింటివారి అవస్తలు అన్నీ ఇన్నీ కావు. అత్తమామల పేరు చెప్పుకొని అప్పులు చేసినా... తాగి తందనాలాడినా... చీటికీ మాటికీ గొడవలకు దిగినా... ఇరుగుపొరుగుతో కొట్లాటలకు తెగబడినా... ఏదైనా సరే! అన్నిటినీ భరిస్తుంటారు. కూతురి కాపురంతో లింకు వున్న వ్యవహారం మరి.

రాజకీయాల్లో జామాతల జాదూ అంతా ఇంతా కాదు. మేకుల్లా వచ్చి ఏకుల్లా తయారౌతారు. మామలకు వెన్నుపోట్లు పొడిచే అవకాశాలూ లేకపోలేదు. మామలు మంత్రి పదవిలో వుంటే పెత్తనమంతా అల్లుళ్లదే. ఎంచక్కా స్కాములు, కుంభకోణాలు, క్విడ్ ప్రో కోలతో వ్యవహారాలు చక్కబెట్టేస్తుంటారు. తొండ ముదిరి ఊసరవెల్లి అయిన చందంగా ... అప్పటి వరకు ఎయిర్‌ఫోర్స్‌గా తిరిగిన అల్లుళ్లు ఎన్నికల్లో నిలబడి ఏకంగా మామల పదవులకే ఎసరు పెట్టిన ఘటనలూ వున్నాయి. అయితే అల్లుళ్లందరూ ఇలాగే వుండరు. మంచి అల్లుళ్లూ వుంటారనుకోండి. ఏదేమైనా...

అల్లుడితో జాగ్రత్త! అన్నది అందరి మాట! ■

టపా

శిక్ష శిక్షే

కొన్ని ఘటనలకు మరుపనేది వుండదు అని మొదలు పెట్టి సమస్తం సమాజాన్ని మొత్తం ఏకిపారేశారు.తీవ్ర నేరాలు చేసిన 16-18 ఏళ్ళ బాలలను మేజర్ కింద చూసే విషయం ఒకింత ఆలోచించదగ్గదే. ఏదైనా నేరము జరిగితే కాని చట్టాలు గుర్తుకు వస్తాయా? సమాజంలో స్త్రీకి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? మన ప్రాథమిక హక్కుల రక్షణకు దిక్కెవరు? లాంటి ఎన్నో ప్రశ్నలు నేటి సమాజంలో సమాధానం లేకుండా మెలిపెడుతున్నాయి. మనసులో మాట ద్వారా ఇలా ప్రశ్నించడం బాగుంది.

రాము, కడప

తెలీని విశేషాలు చెప్పారు

సల్మాన్ గురించి ఎన్నో తెలియని విశేషాలు తెలుసుకున్నాం. నిరాశ్రయుడి ఆత్మ కథ చాలా బాగుంది. తను నిజ జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, భిక్షగాడిగా తన జీవితాన్ని ఒక పుస్తక రూపంలో తీసుకు రావడం నిజంగా అద్భుతం. భిక్షగాళ్ళకు కనీసం మనుషులుగానైనా గుర్తించాలని చాలా చక్కగా వివరించారు. కవితకు కాదేది అనర్హం అన్నారు ఒక కవి. సంగీతానికి కాదేది అనర్హం అని నిరూపించారు కేరళ వాసులు. వెదురు చెక్కతో సంగీత పరికరాలను తయారు చేసి కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. స్టార్ విశేషాలు చాలా బాగున్నాయి. అమీ జాక్సన్ నటనలో తనకంటూ ఒక గుర్తింపు కోసం ప్రయత్నించడం అభినందనీయం. ప్రతి వారం ఏదో ఒక సినీ స్టార్ గురించి ఇస్తే బాగుంటుంది.

మోహన్, నెల్లూరు

విలువ తెలియని కాలం

ఈ వారం అట్టమీది కథ బాగుంది. ప్రస్తుతం మనం అనుసరిస్తున్న క్యాలెండర్ ఎప్పుడు?ఎలా? పురుడు పోసుకుంది అనేది అంశాలు చాలా చక్కగా వివరించారు. మానవతా దీపాలు వెలిగించండి అంటూ నవ సమాజంలో మనిషి విలువలను మరోసారి గుర్తించారు కవి. ఓల్గా రచించిన 'విముక్త' కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం గర్వించదగ్గ విషయం.

ఆరాధన, విజయనగరం

జీవిత పాఠం

నిరాశ్రయుడు రాసిన పుస్తకం గురించి తెలుసుకొని ఆశ్చర్యపోయాం. ఒక మనిషి స్థితిగతులను చూసి వెంటనే ఆ వ్యక్తిపై అభిప్రాయం ఏర్పరుచుకోవడం తప్పని తెలుస్తుంది. వేలాది మంది పాఠకులను ఆకట్టుకుందని తెలిసి ఆనందించాం. ప్రతిభకి అడ్డంకి అవధి అనేవి లేవు. హోదాలు, స్థాయిలకు సంబంధం లేదని నిరూపించింది.

లీల, ప్రొద్దుటూరు.

విముక్త !

మూలకథ పాతదే. స్త్రీకి విముక్తి దొరకదు.ఈ కథ ముఖ్యపాత్రలు ఊర్మిళ, సీత చర్చాంశం, నాటికి నేటికి నిర్ణయాలు తీసుకునే శక్తి పురుషులదే. సీత తనను తాను కాపాడుకోగలదు కాని ప్రాచుర్యంలో ఉన్న కథకి ఈ కథకు చాలా తేడా ఉంది. భర్త భార్యకి అన్ని విధాల రక్షణ కల్పించడం తన ధర్మం. సీతలాగే ప్రతి స్త్రీ కూడా పుట్టిన చోటుకి వెళ్ళడమేనా? విముక్తలో కొత్త కోణం కనిపించింది.

బొడ్డేపల్లి కనకలక్ష్మి, పూజారిపేట

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

ముత్యాల ముంగిట్లో రత్నాల రంగవల్లులు

కవర్ స్టోరీ — 6

సంక్రాంతి పండగ అనగానే ముందుగా గుర్తొచ్చేది అరిసెలు, ముగ్గులే. ఆంధ్రుల అభిమాన పాకమైన అరిసెలతో సమానమైన ప్రాధాన్యత సంతరించుకున్న ముగ్గులకు మనకు వున్న అవినాభావ సంబంధం అలాంటిది మరి. పండగ వస్తుందనగానే మంచి ముగ్గు పిండి, రంగులతో సిద్ధమైపోవడమే కాదు! తమ వీధి మొత్తంలోకి చక్కటి ముగ్గులు వేసి అభినందనలు అందుకోవాలని మహిళామణులు ముచ్చటపడుతుంటారు. పెద్దల దగ్గర నేర్చుకున్న మెలికల ముగ్గులు మొదలుకొని తాజాగా అంతర్జాలం నుంచి అవపోసన పట్టిన చుక్కల ముగ్గుల వరకు ఏ ఒక్కటీ వదలకుండా ఎప్పుడెప్పుడు వాకిట్లో వేద్దామా అని ఉవ్విళ్లూరుతుంటారు.

మార్గదర్శి 3
ఆటబొమ్మల సైన్స్ సార్

స్టార్ 4
'వింటర్' స్టార్

కార్టూన్ పంచ్ 5

నవ్వుల్-పువ్వుల్ 10

ప్రత్యేకం 11
'ఊక' వెలుగుల ఊరు

సినిమా కబుర్లు 14
గిలిగింతలు పెట్టే గిరిజ

కవిత్వమ్ 16
వర్ణాంధకారం

విశేషం 17
ఆస్పత్రే ఇలు

కథ 18
మార్పు

వింతలోకం 20
తాబేళ్ల రక్షకుడు

రుచి 21
అరిసెలు

బాలనేస్తాలు 22
కత్తి దంతం నార్వాల్

కొత్త పుస్తకాలు 24
భావోద్వేగాలకు భాషాంతరీకరణ

చూద్దామా -12
పలుదేశాల్లో పతంగుల మ్యూజియం

అగ్గిపుల్ల, సబ్బు బిళ్ల, చెక్క బల్లా కాదేది సైన్సుకు అనర్హం అంటాడు అరవింద్ గుప్తా. అది కూడా విరిగిపోయినవి, పారేసినవి. 'టాయ్స్ ఫ్రమ్ ట్రాష్' (చెత్త నుంచి బొమ్మలు) పేరిట చెత్త నుంచి రూపొందించే బోధన ఉపకరణాలతో సైన్సు ప్రయోగాల్ని విడమర్చి చెప్పి చిట్టి బుర్రల్ని వెలిగించేస్తున్నాడు. తెగిపోయిన చెప్పుతో మాంటిస్సోరి విద్య సరకు కూర్చోచ్చంటాడు. సైన్సంటే మొహం మొత్తేది కాదు థ్రిల్ కలిగించేది, జాయ్ నింపేది అని నవ్వేస్తాడు. చిన్నారుల ఉత్సుకతను నీరుగార్చే ఏ పాఠమైనా చిత్తు కాగితంతో సమానం అయన దృష్టిలో.



ఆటబొమ్మల సైన్స్ సారు

అభికేంద్రక, అపకేంద్రక బలం వంటి సైన్సు పదం ఒక్కటీ మింగుడు పడదు బుజ్జాయిలకు. ఆ పదంతో పరిచయమే ఆవలింతలు తెప్పిస్తుంది. పైకి కనిపించని జీర్ణవ్యవస్థ నిర్మాణాన్ని గీతల్లో, రాతల్లో ఎంత వర్ణించినా బట్టీ పట్టించినా... వరస క్రమంలో ఏదో అవయవం తారుమారై కడుపు పాడైపోతుంది. వంద శాతం అర్థం చేయిస్తేనే సైన్సు ఇష్టలవుతారు. అందుకు పాఠ్యపుస్తకాల మోతను కాసేపు పక్కన పెట్టాలంటాడు అరవింద్ గుప్తా. మార్కులు, ర్యాంకులు, స్టార్‌ల లెక్కల నుంచి బడి తప్పించుకోవాలని చెబుతాడు. పిల్లలకు తేలిగ్గా అర్థమయ్యే పాపులర్ సైన్సును ఆట బొమ్మల ద్వారా నేర్పించేందుకు ఇప్పటి వరకు 20 దేశాల్లోని 3000 పాఠశాలల్ని చుట్టొచ్చాడు. దాదాపు 35 ఏళ్లపాటు ఇదే లాజిక్ ఉన్న మేజిక్ షో అరవింద్ గుప్తాకు. తనతో పాటు మరో ముగ్గురిని కలుపుకుని పుణె సావిత్రి భాయ్ పూలే విశ్వవిద్యాలయంలోని ముక్తాంగన్ విద్యాంగ్ శోధిక అనే వేదిక ద్వారా బాలల విద్యకు బొమ్మలు చేస్తున్నారు.

ప్లాస్టిక్ బాటిళ్లు, అగ్గిపుల్లలు, స్ట్రాలతో రూపొందించిన వేలాది సైన్సు బొమ్మలు కనిపిస్తాయి. అయస్కాంతతత్వం నుంచి మానవ శరీర పనితీరు వరకు బొమ్మలతో చెబుతాడు. డీఎన్ఏ హీలిక్స్, తరంగ దైర్ఘ్యం ఆకృతులను తాగి విసిరేసిన స్ట్రా పుల్లలతో చటుక్కున కట్టేస్తాడు. ప్లాస్టిక్ బాటిల్‌ను కత్తిరించి టెట్రాప్యాక్‌కు అమర్చి పవన విద్యుత్తు పాఠాల్ని ఊదిపడేస్తాడు. వస్తువుల్ని విరగ్గొట్టేస్తున్నారు, పాడు చేసేస్తున్నారని పిల్లల్లోని ఉత్సుకతను చంపొద్దని అంటాడు అరవింద్ గుప్తా. ప్రతి చిన్నారి ఓ పరిశోధకుడిలానే పుడతాడని ఆ తర్వాత వారిలోని సైంటిస్ట్‌ని పుస్తకాల భారాలతో, ప్రయోగాలకు దూరాలతో చంపేస్తుంటారని బాధపడతాడు. ఒక వస్తువును తడమడం, పరికించడం, ఛేదించి చూడటం, అనుభూతి చెందడం వంటి విషయాలతోనే వారి పరిశోధకుడికి థ్రిల్ కలిగి సైన్సుపై మక్కువ పెరిగేలా చేస్తుందని చెబుతాడు. దీనికి ఉదాహరణగా ఇటలీకి చెందిన మరియా మాంటిస్సోరికి ఎదురైన ఓ ఘటన చెబుతాడు. ఓ తరగతిలో పిల్లలందరూ మరియా చెప్పే మాటలకు కేరింతలు కొడుతుండగా ఒక చిట్టితల్లి ఆసక్తి మరియా తెచ్చిన క్యూబ్ బాక్స్‌పై పడింది. చతురస్రం, గోళం, త్రిభుజాకారాల్లో ఉన్న బొమ్మలు కేవలం అలాంటి ఆకారాల్లో ఉన్న రంధ్రాల గుండా మాత్రమే పెట్టెలోకి పడటంలోని గమ్మత్తు అమితాశ్చర్యాన్ని కలిగించింది ఆ చిన్నారికి. ఏదో మేజిక్ షోను తానే చేస్తున్నట్టు ఆ ఆటను ఆస్వాదిస్తోంది. ఆమె దృష్టిని పక్కకు మళ్లించడానికి మరియా పెద్ద పెట్టున మిగతా విద్యార్థులతో పాటలు పాడించింది. అయినా శ్రద్ధాసక్తులు తగ్గలేదు. ఇక చిన్నారుల లంచం బిస్కెట్‌ను ఇచ్చి చూసింది. దాన్ని తీసుకున్న ఆ చిన్నారి బిస్కెట్‌ను బొజ్జలోకి వేయకుండా, దీర్ఘచతురస్రాకారంలో బిస్కెట్ ఉందని గమనించి వెంటనే ఆ ఆకారంలోనున్న రంధ్రం గుండా పెట్టెలోకి వేసింది. అదీ క్రియేటివ్ సైన్సు అంటే. ఈ సైన్సు బొమ్మల సీరియస్‌నెస్ గురించి మరో విషయం కూడా చెబుతాడు. మనదేశానికే చెందిన ప్రాగ్య, దిలీప్ దంపతుల బిడ్డ నికంజ్ అంధుడు. కొడుకుతో పలకా బలపం ఎలా పట్టించాలా అని ఆలోచించిన తల్లిదండ్రులకు ఓ అద్భుతమైన ఆలోచన తట్టింది. వూల్, వెల్‌క్రోలను ఉపయోగించి 'తాకే పలక'ను తయారుచేశారు. కలం ఆకారంలో ఉన్న పెట్టెలో ఉన్న ఉండ నుంచి వచ్చే ఉన్నిదారం కలం కదిలించిన దిశలో పలకమీది వెల్‌క్రోకు అతుక్కుని తాను గీసింది సరిగ్గా ఉందో లేదో తాకి చూసుకునే అవకాశం కలిగిస్తుందది అంధ విద్యార్థులకు. తయారీకి ఖర్చు చాలా తక్కువ. వస్తువులు తేలిగ్గా దొరుకుతాయి. దీని తయారీ విధానాన్ని ఇంటర్‌నెట్‌లో అందుబాటులో ఉంచినపుడు థాయ్‌ల్యాండ్‌కు చెందిన ఓ టీచర్ తెలుసుకుని దాన్ని తమ అంధ బాలల పాఠశాలలో ఉపయోగించాడు. శిక్షణలో అది పెద్ద మార్పు తేవడంతో థాయ్‌ల్యాండ్‌లోని అంధ పాఠశాలలన్నింటికీ ఓ సంస్థ పెద్ద ఎత్తున తయారుచేయించి ఇచ్చింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు కోటీ ముప్ఫై లక్షల మంది అంధ విద్యార్థులు వినియోగిస్తున్నారని లెక్క. ఇలాంటి బొమ్మలు, ఆవిష్కరణల తయారీని అందరికీ ఉచితంగా అందిస్తున్నారు.

1–5 నిమిషాలు నిడివితో తేలిగ్గా విడమర్చే సుమారు 4,300 బొమ్మల తయారీ వీడియోల్ని 22 భాషల్లో అరవింద్‌గుప్తాటాయ్స్.కామ్ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచారు. తెలుగులోను వీడియోలు ఉన్నాయి. సుమారు 150 పుస్తకాల్ని అరవింద్ గుప్తా రాశారు. అరవింద్ రూపకల్పన చిన్న అయస్కాంతాల ప్రయోగం లెవిటేటింగ్ పెన్ (గాల్లో తేలే కలం)పై పరిశోధన పత్రాన్ని సమర్పించిన హంసా పద్మనాభన్ అనే విద్యార్థిని ప్రతిభను గుర్తించి ఆమె పేరిట ఓ మైనర్ గ్రహానికి పేరుపెట్టారు. పేద విద్యార్థిని దుర్గా జెట్టీ తయారు చేసిన పవన టర్బైన్ ప్రయోగానికి 6 లక్షల రూపాయల నగదు బహుమతి అందింది. ఇదే అరవింద్ సైన్స్ సూత్రం. ఇన్నేట్ క్యూరియాసిటీని మరింత పెంచి చిన్నారి బుర్రలు ప్రయోగాలతో వెలిగే వీలు కలిగించాలి. అరవింద్ ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి. ఓ ట్రక్కుల కంపెనీకి ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన అరవింద్ ఉద్యోగాన్ని వదిలి 1978లో మధ్యప్రదేశ్ హోశంగాబాద్ సైన్స్ బోధన కార్యక్రమంలో చేరి ఆ తర్వాత పూర్తిగా 'టాయ్స్ ఫ్రమ్ ట్రాష్'కే అంకితమైపోయాడు.

✦

'వింటర్' స్టార్

వింటర్ ఒలంపిక్స్‌లో దేశ పతాకాన్ని ఎగరవేసిన తొలి క్రీడాకారుడు. ల్యూజ్ అనే ఒక క్రీడ ఉందని దేశానికి పరిచయం చేసిన స్టార్ ఆటగాడు. అతి పిన్న వయసులో ఒలంపిక్స్ అర్హత పొందిన యువ తార. దేశ క్రీడా శాఖ చేయివిదుల్చుతున్నా... మా దేశ పౌరసత్వం ఇస్తాం.. మా తరపున ఆడండని ఇటలీ సాదరంగా ఆహ్వానించినా దేశం కోసం ఇక్కడే ఆగిపోయిన శివకేశవన్ ఆసియా ల్యూజ్ మేటి క్రీడాకారుడు.

ఓ సన్నటి మంచు ట్రాక్‌పై పెద్ద స్కేట్ బోర్డులాంటి ఓ స్లెడ్ బల్లపై పడుకుని వేగంగా దూసుకుపోతారు ఈ క్రీడలో. రోలర్ కోస్టర్‌ను పక్కకు వేస్తే ఎలా ఉంటుందో అలాంటి ప్రమాదకర మలుపుల మార్గం ఉంటుంది. ఇదే వేగాన్ని విపరీతంగా పెంచేస్తుంది. చాలా సాంకేతికంగా శరీర భాగాల కదలికలతో స్లెడ్‌ను అదుపు చేస్తూ దూసుకుపోవాల్సి ఉంటుంది. గతేడాది డిసెంబర్ ఆసియా కప్‌లో క్షణంలో 2/10వ వంతు తేడాతో స్వర్ణం చేజారిపోవడానికి కారణం స్లెడ్‌లోని టెక్నికల్ లోపమే. రజతంతో సరిపెట్టుకోని శివకేశవన్ గురి ఇప్పుడు జర్మనీలో జరగబోయే వరల్డ్ చాంపియన్‌షిప్ మీద ఉంది. ఇప్పటి వరకు 5 ఒలంపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన శివకేశవన్ ఎన్నో అంతర్జాతీయ పతకాలు కైవసం చేసుకున్నాడు. భారత్ ల్యూజ్‌కు ఒకేఒక్కడిగా, పోస్టర్ బాయ్‌గా ప్రపంచవ్యాప్తంగా కీర్తిని పొందుతున్నాడు. తనలాంటి మరికొందరు వింటర్ గేమ్స్ స్టార్లు భారత్ తరపున ప్రాతినిధ్యం వహించాలని కలలు కంటున్నాడు. అందుకే, 2002లోనే ఇటలీ ఇవ్వజూపిన పౌరసత్వాన్ని కాదనుకున్నాడు. ఆర్థికంగానే కాదు ఎక్విప్‌మెంట్, శిక్షణల్లోను తిరుగులేని సాయాన్ని వదులుకున్నాడు. దేశ పతాకం ప్రపంచ క్రీడా మైదానంలో రెపరెపలాడుతుంటే యువ క్రీడాకారులు మరింత ఉత్సాహం చూపుతారనేది ఆయన ఉద్దేశం. శివకేశవన్ తండ్రిది కేరళ, తల్లిది ఇటలీ. హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో పుట్టి పెరిగిన ఆయన సహవిద్యార్థిని నమితా అగర్వాల్‌ను వివాహమాడాడు. శివకేశవన్ తొలుత ఓ ఐస్ స్కేటర్. 14 వయస్సులోనే జాతీయ చాంపియన్‌గా ఎదిగాడు. భారత్ వింటర్‌గేమ్స్‌కు చిరునామా అయిన హిమాచల్‌ప్రదేశ్‌లో అంతర్జాతీయ క్రీడా సంస్థలు పలు శిక్షణాశిబిరాల్ని నిర్వహిస్తుంటాయి. భారత్ ప్రాతినిధ్యం పెంచడమే లక్ష్యం. ఇలాంటి ఓ శిక్షణ శిబిరానికే 1996-97 సీజన్‌లో ప్రపంచ ల్యూజ్ చాంపియన్ గంథర్ లెమ్మెరెర్ వచ్చాడు. అతడి ల్యూజ్ మాయాజాలానికి సమ్మోహితుడైన శివకేశవన్ తాను కూడా ల్యూజ్ చాంపియన్ కావాలని నిర్ణయించుకున్నాడు. గంథర్ ఏర్పాటు చేసిన క్యాంపునకు ఎంపికయ్యాడు. అలా శివకేశవన్ ప్రయాణం మొదలైంది. ఏడాది తిరిగేనాటికే 16 ఏళ్ల వయసులో ల్యూజ్ చాంపియన్‌షిప్‌కు పోటీనిచ్చాడు. 18 ఏళ్ల శివకేశవన్ కెరీర్‌లో అతడి క్రీడాస్ఫూర్తిని, అంకితభావాన్ని ప్రపంచానికి చాటిన ఘటన సోచిలో నిర్వహించిన గత ఆసియా చాంపియన్‌షిప్‌లో చోటుచేసుకుంది. ప్రాక్టీస్ సెషన్ సమయంలో సుమారు వంద కిలోమీటర్ల వేగంతో స్లెడ్‌పై దూసుకుపోతున్న శివకేశవన్ ఒక్కసారిగా తూలిపోయి బోర్లా పడిపోయాడు. స్లెడ్‌తో సమాన వేగంతో అతడి శరీరం ట్రాక్‌పై దూసుకెళుతుండగా లిప్తకాలంలో తేరుకుని స్లెడ్ అంచును పట్టుకుని మళ్లీ దాని మీదకు చేరి ఫినిష్ లైన్‌ను దాటేశాడు. ఈ వీడియో ఇంటర్‌నెట్ సంచలనం అయ్యింది. ఆసియా స్పీడ్ ఫినిష్ రికార్డు కూడా శివకేశవన్‌దే. గంటకు 134.3 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లి ఒక్కసారిగా తన సత్తా ఏమిటో ప్రపంచానికి చాటాడు. ల్యూజ్ పరికరాలన్నీ చాలా ఖరీదైనవి. ఇక ప్రపంచమంతటా వివిధ దేశాల్లో ఓ టూర్‌గా సాగే వరల్డ్ చాంపియన్‌షిప్‌లకు వెళ్లాలంటే ప్రయాణ ఖర్చు భారీగా ఉంటుంది. కోచ్ లేకుండానే ఇన్నాళ్ల కెరీర్‌ను కొనసాగించాడు. భారీ కోచ్‌ల టీమ్‌లు, ఎప్పటికప్పుడు సాంకేతిక ముందడుగులతో సాగిపోయే ల్యూజ్ జట్టులకు భిన్నంగా ఒకే ఒక్కడు తన క్రీడా ప్రస్థానాన్ని నెగ్గుకొస్తున్నాడు. 2018లో దక్షిణ కొరియా ప్యాంగ్‌చాంగ్ వింటర్ ఒలంపిక్స్‌లో దేశానికి స్వర్ణం తీసుకురావాలనేది ప్రస్తుతం లక్ష్యంగా పెట్టుకున్నాడు. అందుకే ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఆర్థికంగా సతమతమ వుతున్నా ప్రపంచ మాజీ చాంపియన్ డంకన్ కెన్నెడీని కోచ్‌గా పెట్టుకున్నాడు. వరల్డ్ కప్‌ను నెగ్గిన తొలి అమెరికన్‌గా చరిత్ర సృష్టించిన కెన్నెడీ తన క్రీడాజీవితంలో 21 అంతర్జాతీయ పతకాలు సాధించాడు. అమెరికన్ ల్యూజ్ టీమ్‌కు టెక్నికల్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన ఇప్పుడు శివకేశవన్ స్లెడ్‌ను కూడా సాంకేతికంగా మరింత ఆధునికంగా రూపొందించే పనిలో ఉన్నాడు. శివకేశవన్ టాలెంట్ స్కౌట్ ద్వారా కొందరు ఔత్సాహిక క్రీడాకారులకు కూడా గొప్ప సాయమే చేస్తున్నాడు. రాబోయే సీజన్‌లో మరిన్ని పతకాలు సాధించాలని మనసారా ఆశిద్దాం.

కార్టూన్ పంచ్


అసహనం
దేశంలో సామాజిక ఐక్యత రావాలి
?!
?!
గంగాధర్


బాబు వచ్చే.. జాబు తెచ్చే!!
16 వేల ఉద్యోగాలు గల్లంతు
?!


పర్మిషన్ ఇచ్చే... ప్రసక్తే లేదు!!
?!
కోడిపందేలకు సిద్ధమవుతున్న తెలుగు తమ్ముళ్లు


?!
వాతావరణం చల్లబడ్డాక వెళ్తే బెటర్!!
జన్మభూమిలో జనాగ్రహం
?!

ముత్యాల ముంగిట్లో రత్నాల రంగవల్లులు

సంక్రాంతి పండగ అనగానే ముందుగా గుర్తొచ్చేది అరిసెలు, ముగ్గులే. ఆంధ్రుల అభిమాన పాకమైన అరిసెలతో సమానమైన ప్రాధాన్యత సంతరించుకున్న ముగ్గులకు మనకు వున్న అవినాభావ సంబంధం అలాంటిది మరి. పండగ వస్తుందనగానే మంచి ముగ్గు పిండి, రంగులతో సిద్ధమైపోవడమే కాదు! తమ వీధి మొత్తంలోకి చక్కటి ముగ్గులు వేసి అభినందనలు అందుకోవాలని మహిళామణులు ముచ్చటపడుతుంటారు. పెద్దల దగ్గర నేర్చుకున్న మెలికల ముగ్గులు మొదలుకొని తాజాగా అంతర్జాలం నుంచి అవపోసన పట్టిన చుక్కల ముగ్గుల వరకు ఏ ఒక్కటీ వదలకుండా ఎప్పుడెప్పుడు వాకిట్లో వేద్దామా అని ఉవ్విళ్లూరుతుంటారు. మన దైనందిన జీవితంతో అంతగా పెనవేసుకున్న రంగవల్లుల గురించి మనకు తెలీని విశేషాలెన్నో ఈవారం అట్టమీది కథలో.

- ఎస్ నాగశిరీష

ఈ సువిశాలమైన ప్రపంచంలో ఎన్నో దేశాలున్నాయి. ఒక్కో దేశానిదీ ఒక్కో ప్రత్యేకత. అయితే ప్రతి దేశంలోనూ ప్రజలకు కొన్ని సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, వేషధారణ, కళలు ఉండటం సాధారణ విషయం. ఇవన్నీ కూడా మనుషుల జీవనశైలిని ప్రతిబింబించేవీ, నిర్దేశించేవీనూ. ఇక భారత దేశం విషయానికొస్తే అందమైన చీరకట్లు, ముగ్గులున్న ముంగిళ్ళు, లలిత కళలు, ఇలా ఎన్నో ఎన్నెన్నో. ఈ ముచ్చటైన ముగ్గులు పల్లెల్లోనే కాదు. పట్టణాల్లో సైతం దాదాపు ప్రతి ఇంటి గడపల ముందు, లోగిళ్లలోనూ కనువిందు చేస్తుంటాయి. స్థలం లేదు అనుకునే అపార్ట్‌మెంట్లలో కనీసం స్టిక్కర్ల రూపంలోనైనా మెరుస్తుంటాయి. ఈ రంగవల్లులపై మక్కువ తీరకో లేక ఇంకా ఒక నాటి సంప్రదాయాలు మిగిలి ఉన్నాయని చెప్పటానికో... పెద్ద పెద్ద బహుళజాతి కంపెనీలలో సైతం ఏదైనా ప్రత్యేక సందర్భాలలో రంగురంగుల రంగవల్లులతో అలంకరణలు, పోటీలను కూడా నిర్వహిస్తుంటారు. తీరైన సంపద ఎవరింటనుండు... దినదినము ముగ్గున్న లోగిళ్ళ నుండు... అని ఓ కవిగారు రాసిన దానిని బట్టి చూస్తే ఈ ముగ్గుకు, జీవితానికి ఎంత దగ్గరి సంబంధం ఉందని ఇక్కడి ప్రజలు విశ్వసిస్తారో అర్థం చేసుకోవచ్చు. ఏదేమైనా

రంగవల్లులు లేని భారతావనిని మనం ఊహించుకోలేం. ఇక ఈ ముత్యాల ముగ్గులకు సంబంధించి ఆసక్తికరమైన విషయాలెన్నో.

కట్టి పడేసే కోలం

రంగవల్లినే కోలం లేదా ముగ్గు అని కూడా అంటారు. ఈ రంగవల్లి భారత దేశానికి చెందిన ప్రాచీన జానపద చిత్ర కళా రూపం. దీనిని ఇంటి మధ్య భాగంలో కానీ, ఇంటి ముంగిళ్ళలో కానీ రంగు బియ్యం, పొడి పిండి, రంగు ఇసుక లేదా రంగురంగుల పూ రేకలతో అందంగా వివిధ ఆకృతుల్లో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. మామూలు రోజులలో ఎలా ఉన్నప్పటికీ దీపావళి, ఓనమ్, సంక్రాంతి మొదలైన పండుగ దినాలలో ప్రత్యేకంగా వేస్తారు. దేవతలను ఆహ్వానించే పవిత్రమైన అంశం ఈ రంగవల్లి అని ఇక్కడి ప్రజల విశ్వాసం. ఈ రంగవల్లులు గీసే విధానాన్ని ఒక తరం మరో తరానికి అందిస్తూ అటు కళాసంపదనే కాకుండా ఇటు సంప్రదాయాలను కూడా సజీవంగా ఉంచుతున్నారు. రంగవల్లులు అలంకరించటం వెనుక ముఖ్య ఉద్దేశం ఏమిటంటే, అవి తమకు భాగ్యాన్ని కలిగిస్తాయనే నమ్మకం. ముగ్గుల నిర్మాణ క్రమం విషయానికొస్తే ఇవి ఆయా ప్రాంతాల సంప్రదాయాలను, జానపద సాహిత్యాన్ని ప్రతిబింబించటమే గాక, అక్కడి వారి సాధన, నైపుణ్యాలను బట్టి కూడా ప్రత్యేకతను సంతరించుకుంటాయి. సాధారణంగా ముగ్గులను మహిళలే వేస్తుంటారు. వీరు తమ ప్రావీణ్యాన్ని కొన్ని ప్రత్యేక సందర్భాలలో అంటే పండుగలు, మంగళప్రదమైన సందర్భాలలోనూ ప్రదర్శించుకునే వేదికలుగా వీటిని మనం చూడవచ్చు. ముగ్గుల నిర్మాణ క్రమాన్ని పరిశీలిస్తే ఇవి సాధారణంగా రేఖాగణిత ఆకృతుల్లోనూ, దేవతల రూపాల్లోనూ, పూలు లేదా ఆకుల ఆకృతుల్లోనూ ఉంటాయి. అయితే ప్రావీణ్యాన్ని, సృజనను బట్టి ఒక్కొక్కరూ ఒక్కోలా వీటిని పొడిగిస్తూ ఉంటారు. ముగ్గులు గీయటానికి బియ్యం పిండి, రంగులకు సింధూరం (కుంకుమ), పసుపు వంటి సహజ సిద్ధమైన వాటినే వాడుతున్నారు. ఇవే కాకుండా రంగు ఇసుక, ఇటుక పొడి, పువ్వులు, ఆకుల నుంచి తీసిన రంగులు, ఇంకా పువ్వులను కూడా అలంకరణకు వినియోగిస్తున్నారు.

పలు రాష్ట్రాల్లో రంగోలి

ఈ రంగవల్లులను ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. కర్ణాటకలో రంగోలి అని, ఛత్తీస్‌గఢ్‌లో ఛావూక్ పూర్ణ అని, రాజస్థాన్‌లో మండన అని, బీహార్‌లో అరిపన, మహారాష్ట్రలో సంస్కార్ భారతి, తమిళనాడులో కోలం, ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గు, కుమావూంలో ఆలిఖ్ ధాప్, గుజరాత్‌లో సాధియా అని పిలుస్తారు. కేవలం పేర్లలోనే కాదు, ప్రాంతాన్ని బట్టి రంగవల్లులు వేసే తీరులలోనూ మార్పులు ఉన్నాయి.

మధ్య భారత దేశంలో ఛత్తీస్‌గఢ్‌లో రంగోలీని ఛావుక్ అంటారు. ఇక్కడ భవనాలు లేదా ఇంటి ప్రవేశ ద్వారాల ముందు ముగ్గులు వేస్తారు. పొడి బియ్యపు పిండి, తెల్ల మట్టిని ఛావుక్‌లు గీయటానికి ఉపయోగిస్తారు. వీటిని వేయటానికి అసంఖ్యాక ప్రాచీన నిర్మాణ క్రమాలు ఉన్నప్పటికీ సృజనను జోడించి చాలా ఆకర్షణీయంగా చిత్రిస్తున్నారు. ఈ ప్రక్రియ అత్యంత ప్రాచీనమైనదిగానూ, ఇంటికి, కుటుంబానికి కూడా శుభాన్ని, లాభాన్నీ చేకూరుస్తుందని ఇక్కడి వారి నమ్మకం. ముందుగా మహిళలు తెల్లవారుఝామున లేచి ఇంటి ప్రాంగణాన్నంతా శుభ్రం చేసి, ఆవు పేడతో కల్లాపు చల్లి ఛావుక్‌లను గీస్తారు. మహారాష్ట్రలో ఇంటి తలుపులపై రంగోలీలను చిత్రిస్తారు. దీనివల్ల దుష్టశక్తులు ఇంట్లోకి రావటం నివారించబడుతుందని ఓ నమ్మకం. కేరళలో ఓనమ్ పండుగ దినాల్లో పువ్వులను నేలపై పరిచి అలంకరిస్తారు. రోజురోజుకు డిజైన్ పరిమాణం పెరగటంతో పాటు, జటిలంగా కూడా మారుతుంది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలలో కోలమ్ లేదా ముగ్గులను ప్రతిరోజూ నేలపై గీయటం ఆనవాయితీ. ఇవి రేఖాగణిత ఆకృతుల్లో సౌష్టవంగా ఉంటాయి. వీటిని బియ్యపు పిండి లేదా మట్టితో గీస్తారు. రాజస్థాన్‌లో మండనలను గోడలపై చిత్రిస్తారు. వీటిని చిన్న పెద్ద పండుగల సందర్భానికనుగుణంగా ఆకృతులు, పరిమాణాలలో భేదాలుంటాయి. కుమావూంలో ఆలిఖ్ ధాప్‌లు తాళాల్ని రాయటం (సంగీత చిహ్నాల వంటివి), వైవిధ్యమైన ధాపా (ఒక తెగ) చిహ్నాలు, బెల్ బులో, కళాత్మకమైన ఆకృతులతో నిండి ఉంటాయి. ఈ ఆలిఖ్ ధాప్‌లను వివిధ సంఘాల వ్యక్తులు వేర్వేరు మూర్తులను వ్యక్తిగత ఇష్టాలకు అనుగుణంగా, నచ్చిన రీతుల్లో గీస్తారు.

ఉత్సవ సంప్రదాయాలలో ముగ్గుకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. సాధారణంగా ముగ్గులలో తామర పూలు, ఆకులు, మామిడి పిందెలు, కుంభాలు, చేపలు, వివిధ పక్షులు అనగా చిలుకలు, హంసలు, నెమళ్లు, మనుషులు, గుబురు ఆకులు వంటి ఆకృతులు దర్శనమిస్తాయి. దీపావళి పర్వదినాల్లో దీపాలు, వినాయకుడు, లక్ష్మీదేవి, పూలు, పక్షుల ఆకృతులు చూడవచ్చు. రంగోలీ చిత్రించటానికి ఉపయోగించే బియ్యపు పిండి, చెట్ల ఎండు ఆకులపొడి, బొగ్గు, మట్టి, రంపపు పొట్టు మొదలైనవన్నీ చాలా సులభంగా లభ్యమవుతాయి. అందుకే ఈ కళ గొప్ప, బీద అనే భేదం లేకుండా అందరి లోగిళ్ళలోనూ అందం సంతరించిపెడుతోంది. ఒక ముగ్గు వేయటానికి తడి, పొడి పదార్థాలను వాడతారు. వాటిని ఉపయోగించి మొదటగా చుట్టూ గీత (అవుట్ లైన్) గీసి, తర్వాత దానిని రంగులతో నింపుతారు. అవుట్‌లైన్‌ను సుద్ద లేదా నాము, ఇసుక, పెయింట్ లేదా పిండి వంటి తెల్లటి పదార్థాలతో మొదట నేలపై మధ్య భాగాన్ని మార్క్ చేసుకొని, తర్వాత దాని నలుదిక్కులా సాధారణంగా చతురస్ర, షడ్భుజ లేదా వృత్తాకారాలలో విస్తరింపజేస్తారు. ఏ రకమైన ఆకృతి గీయాలనేది గీసే వ్యక్తుల ప్రాంతీయ లేదా వ్యక్తిగత ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. ఒక చిన్న ఆకృతిలో ఆరంభమైన ముగ్గు క్రమంగా శాఖలుగా విస్తరించి, ఎంతో అందమైన రూపు దాల్చుతుంది.

ముచ్చటైన ముగ్గుకు కావాలివి

1. రంగు పౌడర్,
2. రంగోలీ స్పాంజీలు, (ఇవి చిన్న చిన్న ప్లాస్టిక్ డబ్బాలు. వాటి మూతలపై హోల్స్ చేసిన డిజైన్లు ఉంటాయి. అందులో కావలసిన రంగులు నింపి, డిజైన్‌వేయాలనుకున్నచోట స్టాంప్ చేయ టమే).
3. రంగోలీ ప్లేట్స్ (ఇవి కూడా పైన చెప్పిన విధంగానే ఉంటాయి. కాకుంటే ప్లాస్టిక్ డబ్బా బదులు అంచులు గల మెటల్ ప్లేట్స్).
4. రంగోలీ గ్లిట్టర్స్ (వివిధ రంగుల్లో ఉండే గ్లిట్టర్స్ ముగ్గు పూర్తయ్యాక అదనపు ఆకర్షణ కోసం వీటిని పైన చల్లుతారు).
5. రంగోలీ రోలర్స్ (ఇవి రంగోలీ ప్లేట్స్ వంటివే. కాకుంటే ప్లేట్స్ రోల్ చేయబడి గొట్టంలా ఉంటాయి. రంగు లేదా ముగ్గు నింపి రోల్ చేసుకుంటూ వెళ్ళడమే. ఇవి బోర్డర్స్‌కు బాగుంటాయి).
6. రంగోలీ నెట్/స్టెన్సిల్ (ఇవి జల్లెడను పోలి ఉంటాయి. డిజైన్ కావలసిన చోట ఈ ఫ్రేమ్ ఉంచి పైన రంగులు లేదా ముగ్గు చల్లి ఫ్రేమ్‌ను తీసివేస్తే అందమైన ప్రింట్ రెడీ).
7. రంగోలీ పెన్ (కాగితంపై రాయటానికి పెన్ ఎలా ఉపయోగపడుతుందో రంగోలీ పెన్ ఉపయోగించి ఫ్రీహ్యాండ్ డ్రాయింగ్‌లా నచ్చిన డిజైన్లు గీయవచ్చు). 8. ఫ్లోర్ రెగ్యులేటర్ (ఇది ఒక డబ్బాలా ఉంటుంది. చివర హోల్స్ లేదా రంగు నింపి క్యాప్స్ తీసివేసి డిజైన్లు గీయవచ్చు. దీనిని ఉపయోగించి ఒకే సారి ఐదు, ఆరు గీతలు గీయవచ్చు).

రంగోలి రకరకాలు

1 సాంప్రదాయక ముగ్గులు. ప్రతిరోజూ మనం ఇంటి ముంగిలిలో చూసే ముగ్గులే పెద్దల నుంచి నేర్చుకొని గీసేవి.

2 రంగుల ముగ్గులు. ఇవి కొన్ని ప్రత్యేక సందర్భాలలో గీసేవి. ఉదాహరణకు ఏమైనా ఫంక్షన్‌లలోనూ జనవరి ఫస్ట్ వంటి సందర్భాలలోనూ ప్రత్యేకంగా రంగులలో తీర్చిదిద్దేవి. ఈ ముగ్గులను ఫ్రీ హ్యాండ్‌తో, వివిధ రకాల పరికరాలతో చాలా క్రియేటివ్‌గా తీర్చిదిద్దడం నేడు చూస్తూనే ఉన్నాము.

3 పండుగ ముగ్గులు. పర్వదినాల్లో అందంగా గీసే ముగ్గులు ఇవి. పండుగను అనుసరించి గీసే ముగ్గులలో, డిజైన్‌లలో తేడాలు ంటాయి. దీపావళికి దీపాలు పోలినవి నవరాత్రుల్లో దేవతలను పోలి ఉండేవి. సంక్రాంతికి కుండలు, చెరుకు గడలు పోలి ఉంటాయి. ముగ్గు మధ్యలో గొబ్బెమ్మలు, రేగి పండ్లు, పూలతో అలంకరిస్తారు.

4 చుక్కల ముగ్గులు. వీటిలో చుక్కలను కలుపుతూ ఒక రూపాన్ని తెచ్చేవి కొన్ని. చుక్కలు కనిపించేలా వాటి చుట్టూ మెలి కలతో చేసే ముగ్గులు, వీటిలో సరిచుక్క బేసి చుక్కలు. సరితో మొదలు పెట్టి తగ్గిం చుకుంటూ వెళ్ళడం, బేసి నుంచి సరికి రావటం ఇలా చాలా పద్ధతులున్నాయి.

5 రథం ముగ్గు. ఈ ముగ్గు సాధారణంగా సంక్రాంతి పర్వదినాల్లో వేస్తారు. గీతలు గీసి కలుపుతూ, చుక్కలతో వివిధ ఆకారాలతోనూ, మెలికలతో రథాలు చాలానే ఉన్నాయి.

ప్రకృతి నుంచి (ఆకులు, పిందెలు, రేకులు), రేఖాగణిత ఆకృతులు మూలాంశాలుగా ముగ్గులలో గీస్తుంటారు. వీటితో పాటు నెమళ్ళు, ప్రతిమలు, ప్రకృతి దృశ్యాల వంటి సాధారణ మరియు ప్రాతినిధ్యం వహించే వాటిని కూడా చూడవచ్చు. స్టెన్సిల్స్ లేదా స్టిక్కర్స్ వంటి రెడీమేడ్ రంగోలీలు కూడా మార్కెట్‌లో విరివిగా దొరుకుతున్నాయి. శ్రమ తక్కువగా ఉండటమే కాకుండా చూడటానికి కూడా అందంగా, ముచ్చటగా ఉండటం వీటి ప్రత్యేకత. ఒక్కసారి అవుట్‌లైన్ గీయటం పూర్తయ్యాక, దానికి నప్పే రంగులను ఎంపిక చేసి ముగ్గును పూర్తి చేయటం మరో ఎత్తు. దీనికి మళ్లీ తడి, పొడి పదార్థాలను.... అంటే పెయింట్లు, రంగులు, నీరు కలిపిన బియ్యం పిండి, జిప్సం పొడి, రంగు ఇసుక లేదా ఇతర రంగు పొడులు వంటివి వాడుతుంటారు. ఇవేకాక గింజలు, దినుసులు, సుగంధ ద్రవ్యాలు, ఆకులు లేదా పూరేకులు వంటివి కూడా ఉపయోగించి సహజ వర్ణ సౌందర్యాన్ని తీసుకురావచ్చు. ఇప్పుడు క్రేయాన్స్, డైలు (డై చేసిన వస్త్రాలు), ఎక్రిలిక్ పెయింట్‌లు, కృత్రిమ రంగుల కారకాలు వంటివి ఉపయోగించి ప్రకాశవంతమైన రంగులతో అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. సిమెంట్, రంగుల మార్బుల్ పొడి కలిపి ఈ పద్ధతిలో రంగులు తయారు చేస్తారు. దీనికిగాను ప్రత్యేక శిక్షణ అవసరం. ఈ పద్ధతిని ఉపయోగించి చిత్రాలను సహజత్వానికి దగ్గరగా, చాలా ఆకర్షణీయంగా చిత్రించే వీలుంది.

ఎన్నెన్నో ఆకృతులు

ఆకృతి, నిర్మాణ క్రమం, సామగ్రిపై ఆయా ప్రాంతాల సంప్రదాయాల ప్రభావం ఉంటుంది. చతురస్రాకార అల్లిక ఉత్తర భారత దేశంలోనూ, షడ్భుజాకార అల్లిక దక్షిణ భారత దేశంలోని ముగ్గులలో ఎక్కువగా కన్పిస్తుంది. రంగోలీలు సహజంగా వృత్తాకారంలో ఉంటాయి. ఇక రంగుల విషయానికొస్తే ఉత్తర భారతదేశంలో జిప్సమ్‌తోనూ, దక్షిణ భారతదేశంలో బియ్యపు పిండితోనూ, ఓనమ్ ముగ్గులు పూలతోనూ అలంకరిస్తారు. అయితే భారత దేశంలో వేగంగా, విరివిగా జరుగుతున్న వలసల వల్ల అన్ని ప్రాంతాల ప్రజలకు, వారివారి సంప్రదాయాలకూ మధ్య పరిచయంతోపాటు, పరస్పర ఆమోదయోగ్యమైన వాటిని స్వీకరించటం జరుగుతోంది. అన్నింటి కలగలుపుతో కొత్త ప్రయోగాలు అంటే ఉదాహరణకు రంపం పొట్టుతో ముగ్గులు వేయడం. విలక్షణమైన రంగులు, సామగ్రితో రూపొందించిన స్వతంత్ర డిజైన్లు ఎన్నో చూస్తున్నాము.

ఇంటి ముంగిట్లో రంగోలీలు వేయటం వెనుక కొన్ని నమ్మకాలు ఉన్నాయి. తమిళనాడులో దీని వెనుక ఒక పౌరాణిక గాథ ఉన్నట్లు చెప్తారు. ఆ కథానుసారం ఆండాళ్ మార్గళి (ధనుర్) మాసంలో తిరుమల స్వామిని పూజించి ఆయననే పెళ్లాడింది. కాబట్టి ఈ మాసంలో పెళ్ళి కాని ఆడపిల్లలు సూర్యోదయానికి ముందే లేచి, తిరుమలస్వామిని స్వాగతిస్తూ ముగ్గులు వేస్తారు. హిందూ పురాణాల్లో ముగ్గులు వేసే విధానాన్ని గురించి ప్రస్తావన కన్పిస్తుంది. రామాయణాన్ని తీసుకుంటే సీతాదేవి కళ్యాణ ఘట్టంలో మండపంలోని ముగ్గుల గురించిన చర్చ కన్పిస్తుంది. దక్షిణాదిన చోళుల పరిపాలనా కాలంలో సాంస్కృతికాభివృద్ధిలో భాగంగా ముగ్గులకు పెద్ద పీట వేశారు. ఈ ముగ్గుల నిర్మాణంలో సంప్రదాయిక డిజైన్లతో పాటు ఆధునిక డిజైన్లు కూడా ఉన్నాయి. ముగ్గుల డిజైన్‌లన్నీ ప్రకృతి నుంచి స్ఫూర్తి పొంది తీసుకున్నవే. అంతే కాకుండా ఇవి ఆబ్‌స్ట్రాక్ట్ అంటే అమూర్త రూపాలలో కూడా ఉంటాయి. అతి ప్రాచీనమైన ప్రాథమిక ముగ్గులను భారతదేశంలోని (గ్రామీణ ప్రాంతాలలోని) కొన్ని సాంప్రదాయక కుటుంబాల వారు ఇప్పటికీ గీస్తుంటారు. గణిత శాస్త్రంలో చెప్పబడే x, y అక్షాలలో అన్ని వైపులా సౌష్టవంగా ఉంటూ, సాధారణంగా అంచులు గుండ్రంగా ఉండేలా చిన్న చిన్న డిజైన్ల కలయికతో ఒక పెద్ద రంగోలీ రూపుదిద్దుకొంటుంది.

రంగోలి నిర్మాణం...

ఆసక్తికరమైన అంశాలు

సాధారణంగా ధ్వని శాస్త్రాన్ని తీసుకుంటే ధ్వని అనేది కొన్ని శబ్ద తరంగాల సమాహారం. ప్రతి తరంగానికీ ఓ నిర్దిష్టమైన పౌనఃపున్యం (frequency) ఉంటుంది. ఒకవేళ సరైన శబ్ద తరంగాలు అంటే సరైన అనుస్వరాలు కలిస్తే (harmony) శ్రవణానందకరమైన శబ్దాలు వినిపిస్తూ మనసును ఆహ్లాదపరుస్తాయి. అప్పుడది శ్రావ్యమైన సంగీతం అవుతుంది. ఏరకంగా అయితే ధ్వని శాస్త్రంలో అనుస్వరాల కలయికతో (harmony) స్పష్టమైన శ్రావ్య ధ్వనులు మెదడును లాలిస్తాయో, అలాగే దృష్టి సంబంధమైన కొన్ని రకాల డిజైన్‌లు, గీతలు, ఆకారాల కలయికతో కళాత్మకమైన సౌందర్యంగా రూపుదిద్దుకొని చూడటానికి అందంగా ఉండి,



మనసుకు ప్రశాంతత కలిగిస్తాయి. ఈ రకమైన శాఖ సైన్స్ పరిభాషలో ప్రత్యేకంగా ఉంది. దానినే (cymatics) సైమాటిక్స్ అంటారు. ఈ శాఖ కంపనాలకు, రేఖాగణిత రీతులకు మధ్య గల సంబంధాన్ని తెలియజేస్తుంది. ఈ విషయమై సైమాటిక్స్‌లో కొన్ని ప్రయోగాలు చేశారు. ప్రయోగ విధానంలోకి వెళితే ముందుగా కొన్ని ప్రయోగాలు నిర్వహించారు. ఇసుకను చల్లాలి. దానికి ఓ ఫ్రీక్వెన్సీ జనరేటర్ అమర్చితే అది ఆ పళ్ళాన్ని కంపించేలా చేస్తుంది. దానిని ఒక నిర్దిష్ట రెసొనెన్స్ (ఫ్రీక్వెన్సీ వద్ద ప్రతిధ్వని పౌనఃపున్యం) సెట్ చేస్తే ఆ పళ్ళెం కంపించి, ఇసుక రేణువులన్నీ ఒక వరుసలో ప్రత్యేక

నీటి మీద... నీటి కింద ....

నీటిపైన రంగోలీ, నీటి కింద రంగోలీ ఏంటి? అని ఆశ్చర్యంగా అనిపించొచ్చు. వీటిని గీసే పద్ధతులను చూద్దాం. ఈ రెండు పద్ధతులలోనూ దాదాపు ఒకే సామగ్రి అవసరమవుతుంది.

కావలసిన పదార్థాలు : ఒక ప్లేట్ (కొంచెం లోతుగా ఉండాలి. ఈ ప్లేట్ స్టీల్, రాగి, గాజు ఏదైనా తీసుకోవచ్చు), 2 స్పూన్ల నూనె లేదా నెయ్యి, తెల్లటి బియ్యం పిండి లేదా నెయ్యి, రంగోలీ కలర్స్, నీరు, పేపర్ అచ్చు. ముందుగా ఈ ముగ్గు ఎక్కడ ఉంచాలో నిర్ణయించుకోవాలి.. అంటే టేబుల్ పైన, ఇంటి మధ్య హాల్‌లో, టీపాయ్ పైన, ఏదైనా గదిలో వంటివన్నమాట. ఈ ముగ్గులు ఒక షో పీస్‌కు ఏమాత్రం తీసిపోవు. ఒక్కసారి స్థలం నిర్ణయించితే, ముగ్గు గీసిన తర్వాత స్థలం మార్చే అవకాశం లేదు. ఎందుకంటే ముగ్గు పాడయ్యే అవకాశం ఉంటుంది. ఇక ముగ్గు గీసే విధానంలోకి వెళదాం.

నీటి కింద ముగ్గు

ముందుగా తీసుకున్న పళ్ళెంలో నూనె లేదా నెయ్యి వేసి చక్కగా పళ్లెం అంతా అయ్యేలా రుద్దాలి. తరువాత ఒక అచ్చు లాంటిది తీసుకుని దానిపై రంగులు చల్లాలి. నెమ్మదిగా పేపర్ అచ్చు తొలగించి మనకు కావలసిన డిజైన్ ప్రింట్ ప్లేట్ మీద పడుతుంది. అచ్చు అవసరం లేకుండా ఫ్రీ హ్యాండ్ డ్రాయింగ్ కూడా వేయవచ్చు. ఇప్పుడు ఒక్కసారి ప్లేట్ కిందకి వంచి పట్టుకోవాలి. దానివల్ల ఎక్సెస్ కలర్ పోతుంది. తరువాత ప్లేట్‌ను సరిగా ఉంచి అంచు మీదుగా నీటిని మెల్లగా ప్లేట్ నిండేంత వరకు పోయాలి. నీళ్ళు అంటని రంగోలీ రెడీ.

నీటిపై రంగోలి

మొదట పళ్ళెంలో ముందు చెప్పినట్లుగానే కొన్ని చుక్కలు నూనె లేదా నెయ్యి వేసి పళ్ళెం బేస్ మొత్తం స్ప్రెడ్ చేయాలి. తర్వాత చల్లని నీరు పళ్ళెం నిండేలా పోయాలి. ఇప్పుడు ఆ నీటిపై బియ్యం పిండితో డిస్టెంపర్ పౌడర్ స్ప్రెడ్ చేయాలి. ఇప్పుడు పైన తెట్టుగా చేరిన పౌడర్‌పై అచ్చులో (సాధారణ పేపర్‌తో కట్ చేసిన డిజైన్ ఉంచితే లైట్ వెయిట్ కాబట్టి తిప్పుతుంది) పైన చెప్పిన విధంగానే రంగు చల్లాలి. పేపర్ తీసి వేస్తే నీటిపై తేలుతూ అందమైన రంగోలీ రెడీ అవుతుంది. రంగు పొడి చల్లటానికి టీ వడపోసే స్ట్రెయినర్ అయితే రంగు సమంగా కావలసినంత పడుతుంది. ఇంతే కాకుండా ఇంటీరియర్ డిజైనింగ్‌లో భాగంగా టెర్రకోట ఇత్తడి, రాగి పాత్రలలో నీళ్ళు పోసి అలంకరించడం కూడా ఇందులో భాగమే. మన ఇంటి గోడల రంగుకు, మన టేస్టుకు నప్పేలా రంగు రంగుల పూలతో కూడా నీటిపై అలంకరించుకోవచ్చు. ఆకులను వివిధ ఆకృతుల్లో కత్తిరించి పువ్వుల రేకలను చల్లి ఇంకా అందంగా తీర్చిదిద్దవచ్చు.

జామెట్రిక్ పాట్రన్‌లో (రేఖా గణిత రూపంలో) రూపం సంతరించుకుంటాయి. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ రూపాలు భారతదేశంలోని రంగోలి డిజైన్‌ల తీరులోనే ఉంటాయి.

ఏ విధంగా ఒక ప్రకంపన అనేది జామెట్రిక్ పాట్రన్‌కు దారితీసిందో, అదే విధంగా దీనికి పూర్తి వ్యతిరేకం కూడా సాధ్యమే. అదెలాగంటే ఒక వ్యక్తి ఒక జామెట్రిక్ పాట్రన్ చేశాడు అనుకుందాం. ఆ పాట్రన్ అతని మెదడులో ప్రకంపనలుగా మారి, మెదడును శాంతపరుస్తుంది. ఇదే విధంగా ఒక రంగోలి మనిషి మెదడుపై ప్రభావం చూపిస్తుంది. తత్ఫలితంగా మెదడుకు లాలిత్యం కలుగుతుంది. శాస్త్రవేత్తలు, డాక్టర్లు కలిసి దీనిని ఇంకొంచెం పొడిగించి ఒక కొత్త వైద్య వ్యవస్థనే సృష్టించారు. దీనినే సైమాథెరపీ అంటారు. ఈ పద్ధతిలో క్లిష్టమైన ప్రకంపనలు ధ్వని రూపాలుగా మార్చబడతాయి. వీటి ద్వారా మనుషుల శారీరక రుగ్మతలు, తీవ్ర మనోద్వేగాలు నయం చేయబడతాయి. ఎలాగైతే ఫోరియర్ ట్రాన్స్‌ఫామ్ వైబ్రేషన్ పాట్రన్స్‌ను టైం డొమైన్ నుంచి ఫ్రీక్వెన్సీ డొమైన్‌లోకి, ఫ్రీక్వెన్సీ డొమైన్ నుంచి టైం డొమైన్ లోకి) తరంగాలుగా మార్చుతుందో అలాగే విజువల్ డొమైన్‌లో సైమాటిక్స్ సౌండ్ డొమైన్‌లో సైమాథెరపీ ఉంది.

న్యూరోసైన్స్ ఏం చెప్తుందంటే మన మెదడు దృశ్య సంబంధ అంశాలకూ, ఆకృతులకు, నిర్మాణ సంబంధ అంశాలకూ స్పందిస్తుంది. వాటి ప్రభావం మెదడుపై రకరకాలుగా ఉంటుంది. ఉదాహరణకు ఒక సాధారణ రేఖాగణిత ఆకారమైన త్రిభుజం మానవనాడీ వ్యవస్థను, మనోద్వేగాలను ప్రభావితం చేయటమేకాకుండా, ఉత్తేజపరుస్తుందని

నీటిపై రంగోలి

పరిశోధనాశాలలో కూడా వెల్లడైంది. కేవలం ఆకారాలకే కాకుండా మెదడును ఉత్తేజపరిచే గుణం రంగులకు కూడా ఉంది. ఆధునిక విజ్ఞాన శాస్త్రంలో ఇంకా విజువల్ పాట్రన్స్, బ్రెయిన్ స్టిమ్యులేషన్, తదితర అంశాలకు సంబంధించి కొత్త విషయాలు వెలుగు చూడటమే కాకుండా విస్తారమైన పరిశోధన కూడా జరుగుతోంది.

దీనిని బట్టి చూస్తే ముచ్చటగా ఇంటి ముంగిట వేసిన ముగ్గు, ఆ ఇంటి లోగిలిలోకి అడుగు పెట్టిన వ్యక్తికి ప్రశాంతతను కలిగిస్తుంది. తర్వాత మెదడులో ప్రకంపనలుగా మారి సుఖసంతోషాలతో పాటు సౌకర్యాన్ని కూడా కలిగిస్తుంది. అంటే రంగోలీ కేవలం ఒక చిత్రమే కాదు సైన్స్‌కు సంబంధించిన ఒక ప్రకంపనా క్రమం. కొన్ని వేల సంవత్సరాల క్రితమే భారతీయులు ముగ్గును కనిపెట్టారు. దానికి సంస్కృతినీ, సంప్రదాయాన్నీ, ఆధ్యాత్మికతను, కళాసౌందర్యాన్ని జోడించి, శాస్త్రీయతను మరిచారు. ఇప్పుడు ముగ్గు తన సహేతుక రూపాన్ని బయటపెడుతోంది. కేవలం అందం దృష్ట్యా చూసే ఒక ముగ్గులోనే ఇంత విషయం ఉండటం చూస్తే, మనకు ఓ విషయం స్పష్టమౌతుంది. మనం చేసే పనుల్లో, ఆచారాల్లో శాస్త్రీయతకు సంబంధించిన హేతువును వెతకటంపై దృష్టి సారిస్తే ఎన్నో విషయాలు తెలుసుకొనే అవకాశం ఉంది.

ముగ్గుల పోటీలు

సంక్రాంతి వస్తోందనగానే ఆడపిల్లలంతా ముగ్గుల సాధన మొదలు పెడతారు. ముగ్గు వేయడం రానివారైనా సరే అమ్మమ్మలు, నాయనమ్మలను అడిగి నేర్చుకుంటారు. దానికి కారణం సంక్రాంతి పండుగ రోజుల్లో ముగ్గుల పోటీలు పెట్టడం. మన రాష్ట్రంలో ఎప్పటి నుంచో ఆనవాయితీగా వస్తోంది. అనేక గ్రామాల్లో యువజన, మహిళా సంఘాలు ప్రతి సంవత్సరం అదొక వేడుకలా నిర్వహించడాన్ని చూస్తాము. ఇంకా వివిధ ఆఫీసుల్లోనూ, సంస్థల్లోనూ కూడా వార్షిక వేడుకల్లో ప్రత్యేక సందర్భంగా అన్ని పోటీలతో పాటు స్త్రీలకు ముగ్గుల పోటీలు నిర్వహించటం ముగ్గు ప్రత్యేకతను చెప్పకనే చెప్తోంది. ఇక పత్రికల విషయాలు చెప్పనవసరం లేదు. డిసెంబర్, జనవరి నెలల్లో ముగ్గులకు ప్రత్యేక కాలమ్ కేటాయించడమే కాక ప్రతి రోజూ పోటీలు నిర్వహిస్తారు. అలాగే ఛానెల్స్ వారు కూడా పోటీలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ సంస్కృతిని బతుకమ్మ ప్రతిబింబిస్తోంది. ఆంధ్ర ప్రజల సంస్కృతిని సంక్రాంతి ప్రతిబింబిస్తోంది. అయితే ఈ ముగ్గుల పోటీలు కేవలం ఒక ఊరికో, జిల్లాకో, రాష్ట్రానికో, దేశానికో పరిమితం కాలేదు. విదేశాల్లోని తెలుగువారి కోసం కూడా అక్కడి తెలుగు సంఘాలు జరుపుతుండటం విశేషం.

నవ్వుల్ – పువ్వుల్

రేపట్నుంచి

తింగరి: డాక్టర్! నాకు ప్రతి రాత్రి కలలో కోతుల క్రికెట్ మ్యాచ్ కన్పిస్తోంది..

డాక్టర్: ఈ మందులు వాడండి. అంతా సర్దుకుంటుంది.

తింగరి: రేపట్నుంచి వాడతాను డాక్టర్ ఎందుకంటే ఇవ్వాళ మ్యాచ్ ఫైనల్స్!

ముందుగా

ఆ... ఏవోయ్ వెంకట్రావ్ ! రాత్రి ఎనిమిదైంది. అసలే కొత్తగా పెళ్ళైనవాడివి. ఇంటికి వెళ్ళాలనిపించడం లేదా? ఇంకా పని చేస్తూనే ఉన్నావు!! మెచ్చుకోలుగా అన్నాడు మేనేజర్

ఏం లేదు సార్. మా ఆవిడ ఉద్యోగం చేస్తుంది. ముందుగా ఎవరైతే ఇంటికి చేరుతారో వాళ్ళు వంట చేయాలి. రహస్యంగా చెప్పాడు వెంక్రటావు.

సినిమా



టీచర్: ఏంట్రా గోపి! తలనొప్పి.. రొంప..దగ్గు ...అని బడి ఎగ్గొట్టి సినిమాకు వెళ్ళావట?

గోపి: అవును టీచర్. సినిమా యాడ్స్‌లో ఏ మందు వేసుకోవాలో చూపిస్తారని.

ఫోన్

శంభులింగం: అదేంటి జంభూ... మాటి మాటికి తిరుగుతూ ఫోన్ చేస్తున్నావ్, ఎందుకు?

జంభులింగం: నేను ఒకడికి కాల్ చేస్తే మాటి మాటికి తిరిగి ప్రయత్నించమంటుందిరా ఎవరో అమ్మాయి.

అప్పులు

భార్య: బయట ఎండాలేదు, వానా లేదు మరి ఆ గొడుగెందుకు?

భర్త: అప్పులు ఉన్నాయిగా?

ధర్మ సందేహం

శిష్యుడు: బాపూగారి బొమ్మలా అందంగా ఉండి, తెలివైనదై ఉండీ, చాలా చురుకైనదై ఉండీ, భర్తతో ఎప్పుడూ పోట్లాడని స్త్రీని ఏమంటారు స్వామీ? అని అడిగాడు

గురూజీ: 'భ్రమ' అంటారు నాయనా.

తమాషా

భార్య: నాకు ఒంట్లో బాగోలేదండీ!

భర్త: అయ్యో, నేను షాపింగ్‌కి తీసుకెళ్దామనుకున్నానే!

భార్య: అరె, నేను తమాషాకి చెప్పానండీ

భర్త: నేనూ తమాషాకే చెప్పా. ఇక లేచి వంట చెయ్యి.

కళ్ళు తిరుగుతున్నాయ్

రోజు కళ్ళు తిరుగుతున్నాయి. ఏదైన మందులు రాసివ్వండి డాక్టర్!! అన్నాడు రవి.

ఉండవయ్యా.. నీకేం మందులు రాయాలో తెలియక నాకు కళ్ళు తిరుగుతున్నాయ్! అన్నాడు డాక్టర్ గుప్తా.

ఎవరికి భయపడతారో !

"**నా**న్న గారు!"

"**ఏ**మిట్రా?"

"**ఆ**వుని చూస్తే మీకు భయమా;"

"**లే**దు"

"**రా**త్రి పూట దెయ్యమొస్తే?"

" **అ**ప్పుడూ భయపడను. అయినా ఎందుకలా అడుగుతున్నావు?"

"**అ**మ్మకి తప్ప ఇంకా ఎవరికి భయపడతారో తెలుసుకుందామని..."

టీ

వి

ఆ ఊళ్లో...చదువు, వంట, వ్యాపారం ... ఏదైనా సరే? భానుడు ఉన్నంత వరకే! సూర్యాస్తమయం అవుతుందనగానే... హడావిడిగా పనులు పూర్తిచేసుకునేవారు. ఆ కటిక చీకట్లో మగ్గలేక... ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా? అని ఎదురు చూసేవారు. అలాంటి బీహార్ గ్రామీణులకు.... నలుగురు నేస్తాలు వెలుగులు ప్రసాదించారు. అదీ చవగ్గా. ఆ కథనమేంటో తెలుసుకుందాం.

'ఊక' వెలుగుల ఊరు

బీహార్‌లోని ఓ కుగ్రామం తామ్‌కుహ. పశ్చిమ చంపారన్ జిల్లాలో వుంది. కొద్ది నెలల కిందటి వరకు ఆ గ్రామస్తులకు రాత్రుళ్లు చీకట్లోనే గడిచిపోయేవి. ఇక ఇళ్లల్లో కరెంటు దీపాల గురించి ఆలోచించే అవకాశమెక్కడిది? సెల్‌ఫోన్లు వున్నవారు వాటిని చార్జింగ్ చేయించుకోవడానికి మార్కెట్టుకు వెళ్లాల్సి వచ్చేది. విశేషం ఏమంటే... ఫోన్లో మాట్లాడినందుకు అయ్యే బిల్లు కంటే ఫోన్ చార్జింగుకు అయ్యే బిల్లే ఎక్కువ. పైగా చార్జింగు పెట్టుకోడానికి వచ్చిన వారు బారులు తీరి నిలబడాల్సి వచ్చేది. చీకట్లో ఎవరి చెయ్యి ఏదో, కాలు ఏదో తెలిసేది కాదు. ఇక పాములు, తేళ్ల సంగతి ఎవరికి తెలుసు? ప్రతి రోజు ఎప్పుడు సూర్యోదయం అవుతుందా అని ఎదురు చూసేవారు గ్రామస్తులు. బడికెళ్లే పిల్లలు చీకటి పడకముందే తమ హెూంవర్కులు, చదువు పూర్తి చేసుకోవాల్సి వచ్చేది. ఒకవేళ చదువు పని ఏదైనా మిగిలిపోతే చీకట్లో మిణుకు మిణుకుమంటూ వెలిగే కిరోసిన్ బుడ్లే గతి అయ్యేవి. ఒక్కటే కిరోసిన్ బుడ్డి ఇంట్లో వంట దగ్గరకు పిల్లల పుస్తకాల దగ్గరకు వాయిదాల పద్ధతుల్లో వాడుకోవాల్సి వుండేది. గుడ్డి వెలుతురుకు కిరోసిన్ పొగ, కాలుష్యం తోడయ్యేవి. దాంతో పిల్లల కళ్లు కాసేపటికే అలసిపోయేవి. చదువుమీద ఆసక్తి తగ్గిపోయేది. మహిళలకు కూడా ఆ గుడ్డి వెలుతురులో ఏం వండుతున్నామో ఏం తింటున్నామో తెలీని పరిస్థితి. ఈ పాటి దానికి కూడా నెలకు 250 రూపాయల ఖర్చు అయ్యేది. ఇటీవల నలుగురు మిత్రుల కారణంగా వారి చీకటి బతుకుల్లోకి వెలుతురు ప్రవేశించింది. 150 రూపాయలతోనే రెండు బల్బులు, కోరినంత సేపు సెల్‌ఫోన్ చార్జింగు చేసుకునే వీలు కలిగింది. చిన్నారులు చక్కటి వెలుతురులో హాయిగా చదువుకునే అవకాశమేర్పడింది.

ఆ నలుగురు ఎవరో కాదు! జ్ఞానేష్ పాండే, రత్నేష్ యాదవ్, మనోజ్ సిన్హా, చార్లెస్ రాన్స్‌లర్. ముఖ్యంగా జ్ఞానేష్‌కు చిన్నతనం నుంచీ తన రాష్ట్రం చీకటిలో మగ్గిపోవడం ఇష్టముండేదికాదు. ఇతని చదువంతా పొరుగు రాష్ట్రాల్లోనే సాగింది. సెలవుల్లో మాత్రమే ఇంటికి వచ్చేవాడు. ఇంజనీరింగ్ పూర్తిచేశాక అమెరికా వెళ్లాడు. అమెరికాలో మంచి ఉద్యోగం సంపాదించాడు. అక్కడ వుండగానే సోలార్ విద్యుత్తు, పవన విద్యుత్తుపై అధ్యయనం చేశాడు. ఇవేమీ బీహార్‌లో నెలకొన్న పరిస్థితులకు సరిపోతాయనిపించేదికాదు. చీకూ చింతా లేని జీతం–జీవితం, చక్కటి కుటుంబం...ఇవేమీ అతనికి పరిపూర్ణమైన సంతృప్తినిచ్చేవికాదు. ఏదో చెప్పలేని లోటు అతని మనసును కెలుకుతుండేది. దాంతో 2007లో... అమెరికాలోని అన్ని సౌకర్యాలను వదులుకుని... తిరిగి స్వరాష్ట్రానికి చేరుకున్నాడు. అక్కడ...తన ముగ్గురు మిత్రులను కలుపుకుని ఊకతో విద్యుత్ తయారు చేయడం ప్రారంభించాడు. అయితే ఇందుకు ఎన్నో ప్రయోగాలు చేయాల్సి వచ్చింది. తొలి విద్యుత్ ప్లాంట్‌ను పశ్చిమ చంపారన్‌లోని 'తామ్‌కుహ'లో స్థాపించారు. అలా రాష్ట్రంలోని పలు ప్రదేశాలలో ఊక



జ్ఞానేష్ పాండే, రత్నేష్ యాదవ్, మనోజ్ సిన్హా, చార్లెస్ రాన్స్‌లర్.

విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ చవకగా ప్రజలకు అందిస్తున్నారు. అమెరికాలో అన్ని వేల రూపాయల జీతం, సౌకర్యవంతమైన జీవితం ఇవ్వలేని తృప్తి ఇక్కడి ప్రజలకు వెలుగులను పంచడంలో లభించిందని పాండే చెప్తుంటాడు.

చదువు లేకపోవడంతో ఆ బీహారీ గ్రామస్తులకు కాయకష్టమే కడుపు నింపేది. పెద్దలంతా పొలాల్లో, నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యేవారు. తరచుగా సుదూర ప్రాంతాలకు పనుల నిమిత్తం వలసలు పోయేవారు. అలా మగవారు నెలల తరబడి ఇళ్లకు దూరంగా వుండేవారు. ఇక ఆడవాళ్లు తాము సంపాదించిన కొద్దిపాటి ఆదాయంతోనే సంసారాలు ఈదాల్సి వచ్చేది. ఆ ఒక్క గ్రామమనే కాదు. బీహార్‌లో సుమారు అత్యధిక శాతం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేదు. వెలుగుల కోసం అత్యధికులు కిరోసిన్ బుడ్లు, డీజిల్ జనరేటర్లమీదే ఆధారపడుతున్నారు. ఇప్పుడు ఊక విద్యుత్ వల్ల వారి జీవితాల్లో కూడా గణనీయమైన మార్పే కన్పిస్తోంది. స్త్రీ పురుషులకు అక్కడ ఉపాధి లభిస్తోంది. పైగా ఊక నుంచి వచ్చిన బూడిదతో అగర్బత్తీలు తయారు చేయడంలో శిక్షణ కూడా ఇస్తున్నారు. పిల్లలు ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువుకుంటున్నారు. టీ, కిరాణా దుకాణాల వారు చీకటి పడ్డాక కూడా తమ షాపులను తెరచి వుంచుతున్నారు. కొంత మేర ఆదాయాలు పెరగడానికి కారణమైంది కూడా .

✦

పతంగి సంగీతం

కంబోడియాలోని ఫ్నామ్ పెన్హ్ జాతీయ గాలిపటాల మ్యూజియంలో విభిన్నమైన పతంగుల్ని ప్రదర్శిస్తారు. వాటి డిజైన్లన్నీ విస్తుగొలిపేలా ఉంటాయి. కేవలం గాలి పటాల్నే కాదు. వాటి తయారీకి ఉపయోగించే పరికరాలు, సామగ్రిని కూడా చూడొచ్చు. మేటి అయిన పతంగి కళాకారుల గురించి వివరాల్ని, వారి అద్భుత రూపకల్పనలను ఇక్కడ ప్రదర్శన వస్తువులుగా ఉంచారు. సిల్క్ వస్త్రంతో చేసే క్లెంగ్ ఎక్ అనే ఖ్మేర్ గాలిపటాలు వీరి సాంస్కృతిక సంపద. ఇవి దాదాపుగా రెండు వేల ఏళ్ల కాలం నుంచి ఉన్నాయి. మనిషి కన్నా పొడవుగా ఉండే ఇవి చాలా ప్రత్యేకమైనవి. ఎగురుతున్నప్పుడు వచ్చే శబ్దం సంగీతంలా అనిపిస్తుంది. వీటి పేరు కూడా అదే క్లెంగ్ అంటే పతంగి, ఎక్ అంటే సంగీత పరికరం అని వారి భాషలో అర్థం.

స్వాగత పటాలు

చైనాలోని షాండాంగ్ ప్రావిన్స్‌లోని వైఫాంగ్ పతంగుల మ్యూజియానికో ప్రత్యేకత ఉంది. 1987లో ప్రారంభించిన ఇదే చైనాలో అధికారికంగా పతంగుల మ్యూజియంగా గుర్తింపు పొందిన మొట్టమొదటిది. మ్యూజియంలో ప్రదర్శన స్థలం 12 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుంది. మొత్తం 12 ప్రదర్శన మందిరాలుంటాయి. రకరకాల 2 వేల గాలిపటాలుంటాయి. ఇంతకు ముందెన్నడూ చూడని గాలిపటాలెన్నో ఇక్కడ కనువిందు చేస్తాయి. ఇక్కడి పతంగుల్లోకెల్లా ప్రాచీనమైంది 'ల్యూబన్' గాలిపటం. ఇది క్రీస్తుపూర్వం 5వ శతాబ్దికి చెందినది . యాంగ్జియాబు అనే గాలిపటాలు నూతన ఏడాదికి స్వాగతం పలికే చెక్క బొమ్మలకు ప్రతిరూపాలుగా ఉంటాయి. ఇవి ఎగురుతాయో లేదో అనే సందేహం కలుగుతుంది కానీ అవి చాలా ఎత్తుకు కూడా చేరుకుంటాయి. డ్రాగన్‌ను పోలే గాలిపటాలు భలే గిరికీలు కొడతాయి.



పలు దేశాల్లో
పతంగుల మ్యూజియం

'గాలి పటమా పద పద పద.. హంసలాగా పద పద.. ఆకాశమంతా పడిపోదా కింద.. హద్దు కాదు పద పద..' అంటూ సాగే పతంగం పాట ఎప్పుడు విన్నా మన మనసు కూడా గాలిపటానికి మాంజాగా మారి మజా చేస్తుంది. న్యూస్ పేపర్, అన్నం మెతుకులు, చీపురు పుల్లలు, ఓ స్కెచ్ పెన్ను ఉంటే చాలు ఓ పతంగికి సూత్రం కట్టేస్తాం. పటం కట్టు ఎలా అబ్బిందో, గిరికీల జ్ఞానం ఎలా చేతికందిందో తెలుసుకోవాలంటే పలు దేశాల్లోని పతంగుల మ్యూజియాలకు పదండి.

సంక్రాంతికి వంటింట్లో అరిసెలు, నేల మీద ముగ్గులే కాదండోయ్ ఆకాశంలో గిరికీలు కొట్టే గాలిపటాలు కూడా సింబాలికే. దారుల్లో, మైదానాల్లో గాలి పటాలతో పరుగుల పోటీ. గుట్టల్ని, గుళ్లా గోపురాల్ని ఎక్కి మరీ గాలిపటాల్ని గాలివాటంగా ఎగరేసేస్తాం. మాంజాకు గాజు పెంకుల్ని, కరక్కాయల్ని అద్దేసి పోటీలో గెలిచేందుకు దారాన్ని కత్తుల్లా తెగ నూరేస్తాం. చర్కా చేతులకు నూనె పట్టించి రయ్యిన తిరిగేలా సిద్ధం చేస్తాం. పతంగి అంటే పోటీ. ఆకారంలో, పరిమాణంలో, రంగుల్లో, ఎత్తులో ఇలా పక్కోడి గాలిపటాన్ని చకా చేస్తే గానీ పండుగ పూర్తవదు. మనమే కాదు ప్రపంచంలో చాలా దేశాల్లో గాలి పటాలు ఎగరేస్తారు. డెన్మార్క్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నేపాల్, కొలంబియా, ఆస్ట్రేలియా, యూఏఈ, టర్కీ, థాయ్‌లాండ్, స్పెయిన్, సౌతాఫ్రికా, సింగపూర్, పోర్చుగల్, నార్వే, న్యూజిలాండ్, మెక్సికో, మార్టినీక్, కొరియా, ఇటలీ, క్యురాకో, బ్రెజిల్‌లో ఘనంగా గాలిపటాల సంబరాలు జరుపుకుంటారు. ఆ విషయాలన్ని క్షుణ్ణంగా చెప్పేందుకు మ్యూజియాలు ప్రపంచమంతా ఉన్నాయి. వాటిలో కొన్నింటి గురించి...

మన గాలి..

మన దేశానికి చెందిన భాను భాయ్ షా గాలిపటాల రూపకర్త, సేకర్త. యాభై ఏళ్ల కిందట దేశంలో పతంగికి ఆయన పర్యాయ పదంగా ఉండేవాడు. 400 రకాల కాగితాలతో అబ్బుర పరిచే పతంగుల్ని ఆయన రూపొందించారు. కొన్ని



పతంగులకు రంగులు పులమకుండా చిన్న రంగు కాగితం ముక్కల్ని ఒకదానికి ఒకటి అతికించి తయారుచేశారు. చెట్లు, జంతువులు,

పక్షులు, జామెట్రికల్ ఆకారాలతో పాటు చివరకు మనుషుల రూపంలో కూడా పతంగులు కనిపిస్తాయిక్కడ. రాధాకృష్ణుని లీలలు, గార్బా నృత్యం వంటి వాటిని కళ్లకుకట్టే భారీ పతంగులు కూడా ఉన్నాయి. షా సేకరణలతో ఓ మ్యూజియాన్ని గుజరాత్‌లోని అహ్మదాబాద్ సంస్కార్ కేంద్రలో 1986న ప్రారంభించారు. ఇదే దేశంలో తొలి, ప్రపంచంలో రెండో పతంగుల ప్రదర్శన శాల. దేశ, విదేశాలకు చెందిన గాలిపటాలు, వాటికి సంబంధించిన ఇల్లస్ట్రేషన్స్, ఫోటోలు కూడా ప్రదర్శనలో ఉంటాయి. ఇక్కడి ప్రదర్శనల్లో బాగా ఆకట్టుకునేవి మనదేశానికి చెందిన ఫైటర్ కైట్‌లు. మరో విశేషమేమిటంటే దీన్ని ఆధునిక ఆర్కిటెక్చర్ పితామహుడు లె కొర్బూస్యెర్ రూపకల్పన చేశారు. ఇక్కడి గ్రంథాలయంలో క్రీ.పూ. 200 కాలం నుంచి నేటి వరకు ఉన్న వివిధ పతంగుల తయారీ, శాస్త్రీయ విజ్ఞానంపై మంచి సమాచారం దొరుకుతుంది.

మేఘాల్లో మెగారే

ఇండోనేషియాలోని ప్రథమ కైట్ మ్యూజియం జకార్తాలోని లయాంగ్ లయాంగ్. 13 ఏళ్ల క్రితమే సందర్శకులకు తలుపులు తెరిచింది. 2002 ఫిబ్రవరిలో అక్కడ నిర్వహించిన 7వ అంతర్జాతీయ గాలిపటాల ఉత్సవ సందర్భంలో దీన్ని ఏర్పాటు చేశారు. నుసాంతార అదేనండి ఇండోనేషియా ఆర్చిపెలాగో అంతటా కనిపించే గాలిపటాలు ఇక్కడ కొలువుదీరాయి. ఎండాంగ్ ఎర్నావతి అనే మహిళ సేకరించిన ఈ పతంగుల్లో వేరే దేశాలకు చెందినవి కూడా ప్రదర్శనకు ఉంచారు. అక్కడి సాంప్రాదాయక గాలిపటాలతో పాటు ఆధునిక డిజైన్లను కూడా వీక్షించొచ్చు. ఇక్కడ 2 సెం.మీ.ల పతంగితో పాటు 234 చదరపు మీటర్లలో ఉన్న భారీ 'మెగారే' గాలిపటాలు కనిపిస్తాయి.

'వషీ'కరణం

జపాన్‌లోని టోక్యో కైట్ మ్యూజియంలో 20వ శతాబ్ది తొలినాళ్ల గాలిపటాల రకాలు ప్రదర్శనలో చూడొచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విభిన్న పతంగులు కూడా ఉంటాయి. 1997లో ఈ మ్యూజియం డ్రేచెన్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ' కైట్స్: పేపర్ వింగ్స్ ఓవర్ జపాన్' పేరిట గాలిపటాలపై ఓ పరిపూర్ణమైన రంగుల పుస్తకాన్ని తెచ్చింది. 'ఎడో నిషికి-ఈ డాకో' పతంగులు జపాన్ సాంప్రదాయక గాలిపటాలు. మల్బరీ కోవకు చెందిన కోజో చెట్ల నుంచి తయారుచేసే 'వషీ' అనే కాగితం నుంచి వీటిని రూపొందిస్తారు. ఈ కాగితం ప్రపంచంలో అతి దృఢమైన కాగితంగా పేరుగాంచింది. జపాన్ పురాణాల్లో పేర్కొన్న సన్నివేశాలను చిత్రించేందుకు 'సుమి' అనే వర్ణద్రావణంతో ఔట్‌లైన్లు గీసి తర్వాత సహజసిద్ధ రంగుల్ని వేస్తారు. ఇక్కడ సుమారు 3000 పతంగులుంటాయి.

వావ్ 'వౌ'లు

మలేషియాలోని పాసిర్ గుడాంగ్‌లో పతంగుల ప్రదర్శన శాల ఉంది. కొన్ని వందల రకాల గాలిపటాల్ని ఇక్కడ చూడొచ్చు. మూడు స్థాయిల్లో ప్రదర్శనలు ఉంటాయి. మలేషియాలోని మొత్తం 13 జిల్లాలకు చెందిన గాలిపటాల రకాలతో పాటు వివిధ దేశాలకు చెందిన పతంగుల్ని వీక్షించొచ్చు. గాలిపటాలపై విశేష సమాచారాన్ని తెలుసుకునే అవకాశాన్ని అక్కడి గ్రంథాలయం కల్పిస్తుంది. మలేషియన్ వౌ పతంగుల తయారీని చూపిస్తారు. మలేషియాలోనే బందర్ మేలకలోని జలన్ కోటలో కూడా కైట్ మ్యూజియం ఉంది. దీన్ని 1995లో ప్రారంభించారు. యుద్ధాల్లో వాడిన గాలిపటాలు ప్రత్యేకత. మలేషియాలో 13వ శతాబ్ది నుంచే గాలిపటాల్ని ఎగరవేస్తున్నారు. ఇక్కడి పతంగులకు పై రెక్కలు ఉంటాయి.

ఒట్టోతో వాయువేగంగా..

జర్మనీలోని అంక్లామ్‌లో ఉన్న ది ఒట్టో లిలియెంతాల్ మ్యూజియం ప్రత్యేకమైంది. దీన్ని జర్మన్ సివిల్ ఇంజినీర్ ఒట్టో లియెంతాల్ శత జయంతి సందర్భంగా ప్రారంభించారు. ఆయన 1891లో చేసిన పతంగుల ద్వారా ఎగరగలిగే పలు ప్రయోగాలు విజయవంతమైనాయి. ఈయన శాస్త్రీయ కొలమానాల్నే రైట్ బ్రదర్స్ ప్రాతిపదికగా తీసుకుని విమానాల్ని రూపొందించేందుకు ప్రయత్నించారు. ఇక్కడ జర్మన్ల యుద్ధ పతంగీలు కూడా ప్రదర్శనకు పెట్టారు. మనిషిని కట్టి ఎగరేసేందుకు ప్రయత్నించిన భారీ గాలి పటాలు ఆశ్చర్యం కలిగిస్తాయి.



కైట్ సైట్..

కెనడాలోని అందాల ఈరీ సరస్సున పెలీ దీవిలో ఏర్పాటు చేసిన మ్యూజియం పైసియోవిచ్ కుటుంబానికి చెందినది. ఉత్తర అమెరికా, యూరప్‌ల్లో ఎగరేసే పతంగుల రకాల్ని ఆ కుటుంబం పెద్ద ఎత్తున సేకరించింది. ఇక్కడి కళాత్మక పతంగులు చూపు తిప్పుకోనివ్వవు. చారిత్రక నేపథ్యం ఉన్న పతంగులు కూడా ఉన్నాయి. కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా పలు వర్క్‌షాపుల ద్వారా గాలిపటాల తయారీని ముందు తరాలకు పరిచయం చేస్తోంది.

- అనన్య ప్రసిద్ధ్



గిలిగింతలు పెట్టే గిరిజ

"నరుడా! ఏమి నీ కోరిక" అంటూ తెలుగు ప్రేక్షకుల్ని ప్రశ్నించిన, వారాశించిన ప్రతిపాత్రని సమర్థవంతంగా పోషించి.. తన అసమాన నటనా ప్రాభవంతో తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తనకో విన్నూతమైన అధ్యాయం సృష్టించుకున్న అరుదైన నటి గిరిజ! హీరో హీరోయిన్‌లతో సమాన స్థాయి గౌరవాన్ని ఆర్జించగలిగిన అసాధ్యురాలు గిరిజ. ఈమె జీవితంలో చూడని వైభవమూ లేదు. చవి చూడని దరిద్రమూ లేదు. భావి తరాల సినిమా తారలకి ఒక హెచ్చరికలా నిలిచిపోయింది ఆమె జీవితం!

రేలంగితో..

అక్కినేనితో...

అప్పటికే దాసరి రామ తిలకం ప్రముఖ రంగస్థల నటి. పాటలూ పద్యాలు పాడటంలో దిట్ట. ఆమె కృష్ణా జిల్లాలోని కంకిపాడులో 1938 మార్చి 3న పుట్టింది. ఆమె చిన్నతనంలోనే మహా చురుకుగా వుంటూ ప్రతి పదాన్ని విడమరిచి మాట్లాడుతూ ఆట పాటల పట్ల ఆసక్తి చూపించేది. చదువైతే అబ్బలేదు గాని అప్పటికే తెర మీద కనిపించిన ఆడ, మగా పాత్రలనే భేదం లేకుండా వల్లె వేసేది. ఆ రోజుల్లో మూగ చిత్రాలు అంటే సంభాషణలు లేకుండా టూరింగు థియేటర్లలో ప్రదర్శితమవుతుండేవి. దీనికి కస్తూరి శివరావు రన్నింగ్ కామెంట్రీ చెబుతుండేవాడు. ఒక రోజు ప్రదర్శన చూడ్డానికి వెళ్ళిన గిరిజ ఆ మూగచిత్రాల్ని చూసి మాటలల్లింది. అది చూసి ఆశ్చర్యపోయిన శివరావు గిరిజను మెచ్చుకొంటూ ప్రయత్నిస్తే ఈ అమ్మాయికి సినిమాల్లో మంచి భవిష్యత్తు వుంటుంది. అని దీవించాడు. తన 13వ ఏటనే గిరిజ చెన్నపట్నానికి తల్లితో బయల్దేరింది.

సినీరంగ ప్రవేశం

గిరిజ సినీరంగ ప్రవేశంతో తెలుగు భాషని అందంగా మాట్లాడటం ముఖ కవళికల్ని అందంగా మార్చి చూపించడం, అద్దం ముందు హావభావాల్ని ప్రాక్టీసు చేయడం చూసి తల్లి రామతిలకం కస్తూరి శివరావుకి చూపించింది. ఆ రోజుల్లో కస్తూరి శివరావు ప్రభ వెలిగిపోతోంది. ఆయన పరమానంద శిష్యుల కథ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. గిరిజని చూడగానే ముచ్చటపడి అందులో రాజకుమారి పాత్రని ఎంపిక చేశాడు. ఆ చిత్రం ఆశించిన విజయం సాధించలేదు. అయినా గిరిజలో ఏదో స్పార్క్ కొట్టొచ్చేలా కనిపించింది. ఇది ఎవరూ కాదనలేని సత్యం. ఇది గమనించిన రేలంగి విజయ ప్రొడక్షన్సు నిర్మిస్తున్న పాతాళభైరవి చిత్రం కోసం పరిచయం చేశాడు. రేలంగి మాట కాదనలేక. అందులో అమ్మవారి పాత్రకి తీసుకున్నారు. అందులో 'నరుడా! ఏమి నీ కోరిక' అన్నది ఒక్క డైలాగే అయినా ఆ డైలాగ్ సినిమా మొత్తం పాపులర్ అయింది. గిరిజ కూడా పాపులర్ అయ్యింది. గిరిజ గొప్ప హీరోయిన్ కావాలని కలలుగనేది రామ తిలకం. అయితే రేలంగి మాత్రం "అమ్మా రామ తిలకం!, నీ కూతురు గొప్ప క్యారెక్టర్ ఆర్టిస్ట్ అవుతుంది. గొప్ప భవిష్యత్తుంది. కామెడీ వేషాలు చేస్తే ఇక తిరుగుండదు!" అంటూ తన మనసులో మాట చెప్పాడు. ఆ మాట రామతిలకాన్ని గిరిజనీ అసంతృప్తి పరిచింది. అమ్మాయి కోసం ఎన్నో కలలుగంటుంటే రేలంగి గారేమిటి ఇలా డైలామాలో పడేశారు.. అంటూ నొచ్చుకుంది. కొంతకాలం హీరోయిన్ పాత్రల కోసం ఎదురు చూసింది. అప్పటికే జమాజట్టీల్లాంటి హీరోయిన్లు భానుమతి, అంజలిదేవి, యస్.వరలక్ష్మి, జి.వరలక్ష్మి, సావుకారు జానకి, సావిత్రి, భానుమతి, దేవిక వంటి నటీమణులున్నారు. అందరిలోకి పొట్టిది గిరిజ. అంజలీదేవి పొట్టిగా ఉన్నా ఆమె అప్పటికే స్టార్‌గా నిరూపించుకుంది. అప్పట్లో వెండితెర మీద ఆమె పేరు మొదటవేసి రెండవపేరుగా అగ్రహీరోల పేర్లు వేసేవారు. అదీ సంగతి. అయితే రేలంగి పట్టినపట్టు విడవలేదు. గిరిజను బాహటంగానే ప్రోత్సహించేవాడు.

ప్రభ మొదలు

రేలంగితో కలిసి ఒక పక్క హాస్యపాత్రల్లో నటిస్తూనే మరో పక్క కథానాయికగా నటిస్తుండేది. అక్కినేనితో వెలుగునీడలు, ఎన్టీఆర్‌తో మంచి మనసులు, మంచి రోజులు, జగ్గయ్యతో 'అత్తా ఒకింటి కోడలే', శివాజీ గణేశన్‌తో మనోహర, హరనాథ్‌తో 'మా ఇంటి మహలక్ష్మి', చలంతో కులదైవం, రమణ మూర్తితో

ఎం.ఎల్.ఏ. ఇత్యాది చిత్రాల్లో నటించి హీరోలతో సమానస్థాయి పేరు ప్రతిష్టలు తెచ్చుకుంది. గిరిజ ఏ పాత్రలో కనిపించినా ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. వరుసగా ధర్మదేవత, భలేరాముడు, భలే అమ్మాయిలు, దొంగల్లో దొర, ముందడుగు, రాజనందిని, అప్పుచేసి పప్పుకూడు, మనోరమ, రేచుక్క-పగటి చుక్క, ఇల్లరికం, దైవబలం, పెళ్ళికానుక, భట్టి విక్రమార్క, చింతామణి, గజదొంగ, రుణానుబంధం, కులదైవం, ఇంటికి దీపం ఇల్లాలే, జగదేక వీరుని కథ, భార్యభర్తలు, వెలుగునీడలు, సిరిసింపదలు, ఆరాధన, పరువు ప్రతిష్ఠ, బందిపోటు ఈడు-జోడు, రాముడు-భీముడు, కలవారి కోడలు, ప్రేమించి చూడు, మాంగళ్య బలం, నవరాత్రి, రహస్యం వంటి చిత్రాల్లో ప్రధాన పాత్రల్లో కనిపించి ఆ పాత్రలకి జీవం పోసింది. నిజానికి ఏ చిత్రమైనా విజయవంతమైనా ఫెయిలైనా గిరిజ-రేలంగిల నటన బాగాలేదు అని చెప్పడానికి ఎవరూ సాహసించలేదు. అందువలనే ఆమె నటించిన నాలుగు వందల పైచిలుకు చిత్రాల్లో రెండువందల చిత్రాల్లో రేలంగి, గిరిజ నటన విజయవంతమైంది.

గతి తప్పిన జీవితం

గిరిజ ఇండస్ట్రీలో అప్పుడప్పుడే రైజింగ్ స్టార్‌గా ఎదుగుతుండగా ఆమె తల్లి రామతిలకం మరణించడం గిరిజ జీవితానికి దిశా నిర్దేశం లేకుండా పోయింది. అనూహ్యమైన విజయాలు, అంతులేని సంపాదన హీరోలతో సమాన స్థాయిలో పేరు ప్రతిష్టలు పెరిగాయి. పోయిష్ గార్డెన్‌లాంటి విలాసవంతమైన ప్రాంతంలో ఒకపెద్ద భవనం.. రాత్రింబవళ్ళు ఎడతెరిపి లేకుండా షూటింగులూ ఇవన్నీ ఆమెకు స్థిరమైన ఆలోచనలు లేకుండా

చేశాయి. గిరిజ ముక్కుసూటి మనిషి. మనుసులో ఉన్నది మాట్లాడేయడమే తన అలవాటు. అలాగే పొగడ్తలకిట్టే పొంగిపోయి నీరయిపోయేది. అలాగే సన్యాసిరాజు అని ఒక పేరూ వూరూ లేని డైరెక్టరు మాయలో పడింది. నడమంత్రపు సిరి ఆమె చేత చేయరాని పనులను చేయించింది.

నిర్మాతగా పతనం

సన్యాసిరాజుని వివాహం చేసుకున్న తర్వాత నిజంగా సన్యాసినిగా మారిపోయింది. విజయగిరిధ్వజా ప్రొడక్షన్సు కింద 1969లో ఎన్టీఆర్, కాంచన, అంజలితో 'భలే మాస్టారు' అనే సినిమా నిర్మించింది. సన్యాసిరాజు డైరెక్షన్‌లో ఆ సినిమాకి ఆశించిన పేరు రాలేదు. డబ్బు రాలేదు. తిరిగి ఆర్థికంగా పుంజుకొని 1971లో ఎన్టీఆర్ చంద్రకళతో పవిత్ర హృదయాలు సినిమా తీసింది. ఆ సినిమా కూడా విజయవంతం కాకపోవడంతో గిరిజ సంపాదించిన ఆస్తులు అమ్ముకోవాల్సి వచ్చింది. రేలంగి ప్రోద్భలంతో టి. నగర్‌లో ఒక ఇల్లు కొనుక్కుంది. అవకాశాలు చేజారిపోయాయి. సన్యాసిరాజు గిరిజని వదిలేశాడు. కూతురు (సలీమా)ని మాత్రం గిరిజకి మిగిల్చాడు. రేలంగి మరణం గిరిజ జీవితం మీద ఘోరమైన ప్రభావం చూపించింది. పూర్తిగా నిరాధారమైపోయింది.

'గిరిజ ' కష్టాలు పగవారికి కూడా రాకూడదు.

కుటుంబ పోషణ కోసం అప్పులు.. ఆ అప్పుకు అతి వడ్డీలు. టి.నగర్‌లో ఇల్లు అప్పుల వాళ్ళ సొంతమైంది. నిలువ నీడ లేకుండా పోయింది. కూతురు సలీమా మేఘసందేశంలో అక్కినేని కూతురిగా నటించినా ఆదరణ కరువైంది. ఆమె వయసులో వుంది గనుక తన దారిన తాను ఎగిరిపోయింది. గిరిజ రెక్కలు తెగిన పక్షిలా విలవిల్లాడిపోయింది. చివరికి రంగరాజపురం నాగార్జున నగర్ మొదటి వీధిలో ఒక్క చిన్న గదిలో చీకటి జీవితం గడిపింది. చివరికి తినడానికి తిండిలేక కనిపించిన వారిని చెయ్యి చాచి అడిగి ఛీదరింపులకు చిత్రహింసలను అనుభవించి... బలవంతంగా చావలేక మరణశయ్య మీద దిక్కులేని పక్షిలా కన్నీరు మున్నీరుగా విలపిస్తూ... ఎప్పుడు మరణించిందో తెలియని స్థితిలో ప్రాణాలు వదిలింది. దయనీయమైన జీవితానికి నిలువెత్తు నిదర్శనం గిరిజ. అదే వీధిలో ఎదురుగా మిక్కిలినేని, ఆ పక్కన ఉడత సరోజ, ఆ పక్కన నాగభూషణం, సీత, పద్మనాభం, వల్లం నర్సింహరావు, పోతరాజు ఇంత మంది ఉన్నా ఎవరికి తెలీకుండా ఆమె ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

- ఇమంది రామారావు
9010133844

భూమిపై నివసించే అతి పెద్ద జంతువు ఆఫ్రికా ఏనుగు.



ఆక్టోపస్ చేతులతో రుచి చూస్తుంది.

హమ్మింగ్ బర్డ్ ముందుకు వెనకకు ఎగరగలదు.

రంగులు మార్చే జంతువు ఊసరవెల్లి.

శరీర పరిమాణంతో చూస్తే అతి పెద్దగా అరిచే జీవి వాటర్ బోట్‌మన్.



ఆకలి వ్యాధికి వైద్యం కావాలి

ప్రతి పూటా ఒక అరుపు నన్ను
నరాలు గుంజి మరీ శాసిస్తోంది
ఈరోజైనా ఓ పిడికెడు మెతుకుల్ని మింగమని.
గుక్కెడు నీళ్ళతో
ఆ శాసనాన్ని కడిగేస్తున్నాను.
నిద్ర లేవగానే ఓ ఉన్మాది నన్ను
వికారంగా చూస్తూ
ఎన్నాళ్ళిలా బతుకుతావని
ఎగతాళి చేస్తున్నాడు.
ఓ రాయిడ్చి కొట్టి
వాడ్ని వాడి వెక్కిరింతల్ని
తరిమేస్తున్నాను.
ముదురెండలో నా ఎముకలు
ఇక నిలబడలేవని
నన్ను హెచ్చరిస్తోంటే
కళ్ళు మూతలు పడుతుంటే
ఆకాశంలో రాబందులు అరుస్తున్నాయి !
నన్ను పొడిచి పొడిచి తినాలని.
ఇంతలో ..కుక్కల అరుపుల నుండి
కాళ్ళకి కబురొచ్చింది..!
ఒంటరిగా వున్న ఆ వీధి చివరి చెత్తకుండీ
విందుకు ఆహ్వానించిందని.
విసిరేసిన ఎంగిలి విస్తళ్ల మధ్య
విశ్వాసపు జీవుల మధ్య
సగం నిండిన కడుపు
ఎందుకు నీకీ వ్యాధొచ్చిందని ప్రశ్నించింది.
ఆ మాటల్కి నవ్వుకుంటు ఏడుస్తున్నప్పుడు
త్వరగా ఇక్కడి నుండి వెళ్ళిపో అని
కుళ్లిన కంపు నన్ను కసిరింది.
ఇంతటి దౌర్భాగ్యం, ఇంత దరిద్రంలో
ముందుకు నడకను సాగించాలా అని
నా ప్రయాణం నన్ను చీదరించుకుంటుంటే
సమాజం మారేంత వరకూ
ఈ ఆకలి వ్యాధికి
వైద్యం వుండదని నిక్కచ్చిగా
నా నీడ అడుగులకు
నీతిని బోధించింది

-యం.శబరిష్, తిరుపతి.

వర్ణాంధకారం

దూరంగా
మరీ మైళ్ళ దూరం కాదు
కూతవేటులో జీవనం
మా అంటరాని నేలలో
కాల చక్రంతో పాటు
కార్యక్రమాలు పూర్తి చేస్తూ
కన్నబిడ్డల్ని భూమాత
రెండుగా ఎందుకు విభజించిందో
అస్పృశ్యత పదాన్ని అక్షరాలు
ఎందుకు తయారు చేశాయో
వాడలో వున్నాయి దార్లు
పడిలేస్తూ నడవటానికి
వరలు కూలటానికి సిద్ధంగా
ఓ బావి వుంది
గొంతు పిసికి చంపుతున్నట్లు అరవటానికి
ఓ గిలక వుంది
మూరకు మూడు అతుకులతో
ఓ చేంతాడు ఉంది
గర్భగుడిలో విగ్రహం లేని
ఓ రామాలయం వుంది
నిప్పంటిస్తే బూడిదగా మారే
గుడిసెలున్నాయి!
పొలిమేరలో నిల్చి
మోతుబరు కేకేస్తే
వాడ వాడంతా పొలంలో హాజరు
సాయంత్రం కూలి కోసం
వరుసగడితే
వ్యంగ్యార్థాలు
ద్వంద్వార్థాలు
మాకూ ఉన్నాయి చదువులు
ఒక చోట దోసెడు భిక్షగా
ఒక చోట చిటికెడు రక్షణా
వాడను దూదిపింజతో
తూకం వేస్తూ పూరు
వాడలో కాలిడిన మోతుబరు మైల
ఇంటి స్నానంతో శుద్ధి!
మైలకు భయపడ్డ పాదాలు
వాడకు దూరంగా
మరీ మైళ్ళ దూరం కాదు
కూత వేటు నడకలో-

- అడిగోపుల వెంకటరత్నమ్
సెల్:9848252946

ఎక్కడైనా రెసిడెంట్ వైద్యులుంటారు. కానీ రెసిడెంట్ రోగులుంటే ఆశ్చర్యమే కదా. ఏదో వీరు కోమాలో వుండో, మరేదో దీర్ఘ కాల జబ్బున పడో ఇలా ఆస్పత్రికే పరిమితం అయిపోలేదు. కుటుంబాలతో కలిసి రెండు, మూడు తరాలుగా నివసిస్తూ ఆస్పత్రినే ఇంటిగా మార్చేసుకున్నారు. వైద్యం తీసుకుంటూనే పైసా వచ్చే పని చేసుకుంటున్నారు. చైనాలోని వుయీ ప్రాంతంలో ఉంది ఆ వైద్య గృహం.

ఆస్పత్రే ఇల్లు!

ఆస్పత్రుల చుట్టూ తిరగడం మహా యాతన. జబ్బు పడిన వ్యక్తికి సపర్యలు చేసేందుకు ఒకరిని మాత్రమే సాధారణంగా అనుమతిస్తారు. మిగతా వారంతా సందర్శన వేళల్లోనే వార్డుల్లో కాలు పెట్టాలి. ఇంటి భోజనం తెచ్చే క్యారేజీ ప్రతిరోజు మైళ్లకు మైళ్ల చక్కర్లు కొడుతుంది. ఓ రోగి పది రోజుల పాటు ఆస్పత్రిలో ఉన్నాడంటే కుటుంబమంతటికీ జ్వరం వస్తుంది. ఉద్యోగాలు, పనులకు వెళ్లే వాళ్లకు ఆటంకం, ఇంటిని చూసుకునేందుకు తీరిక కష్టం. అదే 'ఆస్పత్రే ఇల్లులా మారితే' అన్న ఆలోచనే చాలా హాయినిస్తుంది. దాన్నే అమల్లో పెట్టేశారు యాంగ్జియా ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ పూ జియాంగ్హువా. ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదురవుతున్నా దాన్నో బుల్లి కాలనీలా రూపాంతరం చెందించాడు. ఒకప్పుడు ఈ ఆస్పత్రి మిగతా వాటిలానే ఉండేది. ప్రభుత్వం నడిపించిన డాంగ్యింగ్ క్వారీ కంపెనీ కార్మికులు, ఉద్యోగుల కోసం ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. క్వారీ పనుల వల్ల న్యూమోకోనియోసిస్ అనే ఊపిరితిత్తుల వ్యాధి వారిని సతమతం చేసేది. కార్మికులకు సౌకర్యంగా ఉండేలా 1960లో ఈ ఆస్పత్రి నిర్మించింది యాజమాన్యం. అప్పట్లో 400 మంది దాకా దీనిలో చికిత్స చేయించుకునేవారు. నలభయ్యేళ్లకు కంపెనీ మూతబడింది. కానీ రోగుల సమస్య మాత్రం తగ్గలేదు. తర్వాత కొన్నేళ్ల పాటు స్థానిక ప్రభుత్వం దాని నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. పనిలేక పోవడం, వేరే వృత్తులకు వలస వెళ్లిపోవడంతో ఆస్పత్రికి వచ్చేవారి సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. కానీ కొందరు రోగులు మాత్రం మిగిలిపోయారు. అంత పెద్ద ఆస్పత్రికి నిధుల ఖర్చు తప్పితే చికిత్సకు వచ్చే రోగులు కనిపించలేదు. చివరకు మూసివేద్దామని నిర్ణయించుకుంటున్న తరుణంలో ఓ 36 మంది రోగులకు దీర్ఘకాల సేవలు చేయాల్సి రావడం, వారి కుటుంబాలు ఆ ప్రాంతం నుంచి కదిలే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వానికి ఏం చేయాలో పాలుపోలేదు. దీనికి పరిష్కారంతో ముందుకు వచ్చాడు సీనియర్ వైద్యుడు పూ జియాంగ్హువా.

రోగుల హెల్త్ ఇన్సూరెన్స్ నిధుల ద్వారా తాత్కాలికంగా నడిపించి ఆ తర్వాత ఏదైనా ప్రణాళిక వేద్దామని సూచించాడు. దాంతో స్థానిక ప్రభుత్వం జియాంగ్హువాకే ఆస్పత్రి బాధ్యతల్ని అప్పజెప్పింది. ఆస్పత్రి భవనంలోని గదులు ఎలాగో ఖాళీగా ఉన్నాయని రోగుల కుటుంబాలు అక్కడ ఉండేందుకు కొన్ని షరతులతో అనుమతిచ్చాడు. రోజుకు 60 రూపాయల చొప్పున అద్దె వసూలు చేశాడు. రోగి బాగోగులు చూసుకోవడం తేలికవడం, పనులకు ఆస్పత్రి నుంచే తయారై వెళ్లడం కుటుంబ సభ్యులకు ఊరటనిచ్చింది. అద్దె డబ్బుతో కాస్తో కూస్తో నిర్వహణ ఖర్చులు చేతికందాయి. ఇలా చివరకు కుటుంబాలు మొత్తం నివాసం ఉండటం ప్రారంభమైంది. దాన్నో కాలనీగా మార్చేసుకుని పొలాలు చూసుకోవడం, మిగతా వృత్తి పనులకు వెళ్లడం మొదలైంది. వంటావార్పు, విరామం, ఆఖరకు వినోదం కూడా తోడైంది. ఆస్పత్రి ప్రాంగణంలోనే కూరగాయల తోట వేశారు. అందరూ ఓ ఉమ్మడి కుటుంబంలా కలిసిమెలిసి గడుపుతున్నారు. సుమారు 30 ఏళ్లుగా ఉంటోన్నవాళ్లూ ఉన్నారు. లిన్ జైమింగ్ అనే వృద్ధుడు వారిలో ఒకరు. రెండేళ్ల క్రితమే వాంగ్ తియాన్‌ఫాంగ్ అనే రోగి కూడా ఇక్కడే కుటుంబంతో నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. ఖర్చు తక్కువగా ఉండటం మిగతా వారూ కుటుంబంలా తోడుగా ఉండటంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఈ రకంగానైనా రోగులు త్వరగా కోలుకుంటారని ఆయన ఉద్దేశం. ఆ తర్వాత ఆస్పత్రి బరువును ఈ కుటుంబాలు కాస్త మోస్తూ వైద్యులు, సిబ్బందికి నామ మాత్రంగానైనా జీత భత్యాలు అందేలా జాగ్రత్త పడుతున్నాయి. సేవే ప్రధానమని నమ్మిన ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా రోగులకు చికిత్సనందిస్తున్నారు. ఎంత పొదుపుగా ఉన్నా ఇన్సూరెన్స్ సొమ్ము చాలీచాలనంతే ఉండటంతో ఆస్పత్రి నిర్వహణ చాలా కష్టంగా మారింది. సున్నం కొట్టించడం పక్కన పెడితే భవంతిని చుట్టేస్తున్న తీగమొక్కల తొలగింపునకు కూడా కనాకష్టమవుతోంది. మందు మాకులకే సొమ్మంతా ఖర్చయిపోతోంది. కొన్నిరోజుల్లోనే పూర్తిగా మునిగిపోయే పరిస్థితి. దీని నుంచి బయటపడే మార్గమేంటో పూకు తెలియడం లేదు. ✦

◆ కథ

మార్పు

- తోట శ్రీనివాసరావు
8977066980



సెల్ ఫోన్ రింగ్ అవగానే వంట గదిలో వున్న పార్వతి ఒక్క ఉదుటున హాల్లోకి చేరుకుంది.

“హలో... చెల్లెమ్మా! నేను వెంకట్రావుని. మీ అమ్మాయి మాకు నచ్చింది. కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవాలని మేం నిర్ణయించుకున్నాం. రేపే నిశ్చయ తాంబూలాలు. ఉంటానమ్మ!” అంటూ ఫోన్లో సమాచారమందించాడు వెంకట్రావ్.

పార్వతి మనసు సంతోషంలో మునిగిపోయింది. ఈ శుభవార్తను తన కూతురు అనితకు ఎప్పుడెప్పుడు చెపుదామా అని ఆత్రంగా ఎదురుచూస్తూ కూర్చుంది. ఇంతలో అనిత ఆఫీసు నుండి రానే వచ్చింది. బ్యాగ్‌ను టీపాయి మీద పడేసి అలసటగా కుర్చీలో కూర్చుంది.

“అనితా! మొన్న పెళ్ళి చూపులు చూసుకుని పోయిన ఆ కనిగిరి వాళ్లకు నువ్వు నచ్చావని, రేపే నిశ్చయ తాంబూలాలు పుచ్చుకుందామని చెప్పారమ్మా” వెలిగి పోతున్న ముఖంతో చెప్పింది పార్వతి. ఈ వార్త విన్న అనితలో అలసట ఎగిరి పోయి ఉత్సాహం ప్రవేశించింది. ఇంతలో పార్వతి స్నేహితురాలు పక్కింటి రాజేశ్వరి వచ్చింది. ఆమె కూడా ఈ వార్త విని సంతోషించింది.

“ఇంకే ... నీ కష్టాలు గట్టెక్కినట్లేనే పార్వతి. భర్త పోయాక పెన్షన్ డబ్బుతో, గుట్టుగా సంసారాన్ని నెట్టుకొచ్చి, కష్టపడి కూతుర్ని చదివించావు. దానికొక ఉద్యోగమొచ్చింది. ఇంకా ఆ మూడు ముళ్ళు సంబరం జరిపించితే, నీ బాధ్యత తీరిపోతుంది. ఇక ఆ ఒక్క మొగపిల్లాడిని చదివించి ప్రయోజకుణ్ణి చేస్తే అవసాన దశలో నీకింత అండ ఉంటుంది” అంది రాజేశ్వరి.

“మగ పెళ్ళివాళ్ళు కట్నం అక్కర్లేదన్నారు గనుక, పెళ్ళి ఘనంగా జరిపిస్తే వాళ్ళూ సంతోషిస్తారు. ఏ మంటావ్ రాజేశ్వరి!” సంతోషంగా సూచించింది పార్వతి.

“నీ ఆలోచన బాగుంది” అంది రాజేశ్వరి.

“ఈ సమయంలో ఆయనే వుంటే ఎంత సంతోషపడే వారో! పెళ్ళంటే ఫంక్షన్ హాలు బుక్ చెయ్యాలి. వంటవాళ్ళని మాట్లాడాలి. భజంత్రీలను కుదర్చాలి. పెళ్ళిబట్టలు, మంగళ సూత్రాలు, నగలు శుభలేఖలు ఎన్నో పనులుంటాయ్. ఈ వివాహం సజావుగా జరగాలంటే మీ సహాయం కూడా కావాలి రాజేశ్వరి” అంటూ అర్థించింది పార్వతి.

“నువ్వు నోరు తెరచి అడగాలా? మేమంతా నీకు అండగా లేమూ? నువ్వేం విచార పడనక్కర లేదు. రేపట్నించే ఏర్పాట్లు ప్రారంభిద్దాం. మ్యారేజ్ హాల్ బుక్ చెయ్యమని మావారిని ఇప్పుడే పంపిస్తాను” అంది రాజేశ్వరి.

పార్వతి నిశ్చింతగా ఊపిరి పీల్చుకుంది. నిశ్చితార్థం అయిపోయింది. వివాహ సమయం కూడా నిర్ణయించబడింది. ఇంటికి సున్నాలు అన్ని పనులూ పూర్తిచేసుకుంటూ వస్తున్నారు. అనిత కూడా ఆఫీసుకు సెలవు పెట్టింది.

●●●

ఒక రోజు మధ్యాహ్నం కాబోయే వియ్యంకుడు వెంకట్రావు వచ్చాడు. పార్వతి అతన్ని కూర్చోబెట్టి అన్ని మర్యాదలూ చేసింది.

“అమ్మా పార్వతి... నీకో విషయం చెప్పాలి. మరేం లేదు.... నాకున్నది ఒక్కగానొక్క కొడుకు. మా అబ్బాయికి లక్షల కట్నమిస్తామని ఎన్నో సంబంధాలు వచ్చాయి. కాని అబ్బాయి, అమ్మాయి జాతకాలు కలిశాయని, అమ్మాయి అణకువ కలిగిందని మాకు నచ్చి అబ్బాయిని పెళ్ళికి ఒప్పించాం. కాని మా బంధువులు అబ్బాయికి కన్ను వంకరా, కాలు వంకరా కట్నం తీసుకోకుండా పెళ్ళి చేస్తున్నారు అంటూ పోరు పెడుతున్నారు. అబ్బాయి కూడా ఏదో వ్యాపారం ప్రారంభించాలని, అందుకు కొంత డబ్బు కావాలని అంటున్నాడు. కట్నం లేని వివాహం చేసుకోవడానికి వాడు కూడా సుముఖంగా లేడు” నసుగుతూ పలికాడు వెంకట్రావు.

పార్వతి గుండెల్లో పెద్ద బండరాయి పడింది.

“కట్నాలు, కానుకలు అక్కరలేదు. అమ్మాయి నచ్చింది అని మీరు చెప్పాకనే మేం పెళ్ళికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం. అమ్మాయికి ‘వి.ఆర్.ఒ’ ఉద్యోగముంది. నెలనెలా జీతమొస్తుంది. పెళ్ళి ఏర్పాట్లు మా తాహతకు మించి ఘనంగానే చేస్తున్నాం. అబ్బాయికి బంగారు చెయిను,

ఉంగరం, బ్రేస్‌లెట్ చేయించాం. మీ అందరికీ ఖరీదైన బట్టలు పెడుతున్నాం. పెళ్ళి నాలుగు రోజులుందనగా మీరు మాటతప్పటం భావ్యం కాదు" ఆందోళనగా పలికింది పార్వతి.

"నువ్వు అలా అంటే , నేనేం చెప్పగలనమ్మా . మీరు కొంత డబ్బిస్తే వాడేదో వ్యాపారం పెట్టుకుని గౌరవంగా బతకాలనుకుంటున్నాడు. భార్య తెస్తే తిని, తిరుగుతున్నాడన్న మాట అనిపించుకోవడం ఇష్టం లేదు" అంటూ లౌక్యం ప్రదర్శించాడు వెంకట్రావు.

"పెళ్ళి చూపులప్పుడే మీకు మా దగ్గర డబ్బు లేదన్న విషయం, మా కుటుంబ పరిస్థితి అంతా వివరించాను. ఇప్పుడు కట్నం అని పట్టుబడితే మేం ఎక్కడి నుంచి తేగలం? అమ్మాయి ఉద్యోగం కూడా పర్మినెంట్ అయి కొద్ది నెలలే అయింది"

"క్యాష్ లేని పక్షంలో మీరు ఉంటున్న ఇల్లు వుంది కదా. దాన్ని మా అబ్బాయి పేరున రిజిష్టర్ చేసి ఇవ్వండి. అబ్బాయికి మేం నచ్చజెప్పుకుంటాం. ఏ విషయం రెండ్రోజుల్లో చెప్పండి. లేదంటే మేం మరో సంబంధం వెతుక్కుంటాం". అంటూ బయలు దేరాడు వెంకట్రావు.

'ఇచ్చుకునే వారు ఈగ పుచ్చుకునేవారు పులి' అనే సామెత గుర్తొచ్చింది ఆమెకు. ఆలోచించే కొద్దీ అంతా అయోమయంగా ఉంది. ఏం చెయ్యాలో పాలుపోవటం లేదు.

ఆఫీసు నుండి వచ్చిన అనిత తల్లి ముఖంలో దిగులును పసిగట్టింది. "ఏమయ్యిందమ్మా?" అన్న ప్రశ్నకు "ఏమీ లేదని" జవాబు దాట వేసింది. చివరకు అనిత రాజేశ్వరిని పిల్చుకొచ్చాక మగపెళ్లి వారు పెట్టిన పేచీ గురించి నోరు విప్పింది. "ఆడ పెళ్ళివారం పైగా అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం గనుక మన జుట్టు వాళ్ల చేతుల్లో ఉందని వాళ్ల ధీమా. వీళ్ళింత మోసగాళ్ళని అనుకోలేదు". కోపంగా పలికింది రాజేశ్వరి. "వీళ్ళ అసలు రంగు ముందే బయట పడింది. ఈ సంబంధాన్ని క్యాన్సిల్ చేసుకుందామమ్మ "అంది అనిత కోపంగా. "రోట్లో తలపెట్టాక రోకలి పోటుకు భయపడితే ఎలా? నువ్వు చిన్న పిల్లవు, నీ ఆవేశం నీదే కాని ఈ లోకం పోకడ నీకు తెలియదు. నిశ్చయ తాంబూలాలు ఇచ్చిపుచ్చుకున్నాక పెళ్ళి ఆగి పోతే, ఆ పిల్లకు మరో సంబంధం కుదురుతుందా? అందుకే నేనొక నిర్ణయానికొచ్చాను. ఇల్లు వాళ్ళ పేరున రిజిష్టర్ చెయ్యటానికే నిర్ణయించుకున్నాను.

"ఇల్లు వాళ్ళ పేరున పెడితే రేపు నీ పరిస్థితి ఏమిటి? ఇంత చేసిన వాళ్ళు రేపు ఇల్లు

అమ్మేయాలి. ఖాళీ చెయ్యమంటే మీరు ఎక్కడికి వెళతారు?" అంది అనిత.

"నిజమే పార్వతి, నీతి నియమాలు లేని మనుషులు ఎంతకైనా తెగిస్తారు. వాళ్ళ కన్ను ఈ ఇంటి మీద పడింది. అందుకే కట్నం అక్కరలేదని మనల్ని పెళ్ళికి పురమాయించి, తీరా అన్ని ఏర్పాట్లు చేసుకుంటూ ఉండగా, మనం వెనక్కి వెళ్ళలేమని గ్రహించి ఇల్లు రాసివ్వమని పేచీ పెడుతున్నారు. ఇలాంటి దగాకోరు సంబంధం చేసుకోవడం కన్నా తెగ తెంపులు చేసుకోవటమే మంచిది" అంటూ సలహానిచ్చింది రాజేశ్వరి.

"కానీ ఇలా అర్ధాంతరంగా పెళ్ళి ఆగిపోతే దాని భవిష్యత్తు ఏమవుతుంది? లోకులు కాకులు. ఏవేవో పుకార్లు పుట్టిస్తారు. ఒంటరిదాన్ని, ఈ కష్టాన్ని ఎలా ఎదుర్కోవాలి" అంటూ కన్నీటి పర్యంతమయ్యింది పార్వతి. తల్లి కన్నీరు చూసిన అనిత తను కూడా కన్నీటిని ఆపుకోలేకపోయింది.

"మనం ఇలా బేలలుగా ఉన్నాం కనుకనే ఇలాంటి నయవంచకుల నాటకాలు నిరాఘాటంగా సాగిపోతున్నాయ్. అమ్మాయికి గవర్నమెంట్ ఉద్యోగముంది. దాని పెళ్ళి గురించి దిగులెందుకు? ఎవరయినా కళ్ళకద్దుకుని చేసుకుంటారు. లేనిపోని ఆలోచనలు పెట్టుకుని భయపడటంలో అర్థం లేదు. బురద అని తెలిసి అందులోకి దిగటం మూర్ఖత్వమే అవుతుంది" అంది రాజేశ్వరి.

"అవునమ్మా! పెళ్ళి తప్పిపోవటం ఆడపిల్లకే కాదు మగ పెళ్ళి వాళ్ళకూ అవమానమే. మనం ఇలా బేలగా భయపడాల్సిన పని లేదు. మీ బోడి సంబంధం మాకక్కరలేదు అని ధైర్యంగా వాళ్ళ ముఖానే చెప్దాం" స్థిరంగా పలికింది అనిత.

(ఐద్వా కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్య ంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణా మాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధా న్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక,హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

వీపే కేన్వాసు

వీపు మీద జుట్టుంటే నలుగురిలో తిరగడానికి పెద్ద ఇబ్బంది పడిపోతారు పాశ్చాత్యులు. బీచుల్లో సన్‌ట్యానింగ్‌కు అదో పెద్ద అడ్డంకి. అందరిలానే మైక్ వోల్ఫ్‌ను కూడా బాగా ఇబ్బంది పెట్టేసిందిది. పదహారేళ్ల క్రితం పెళ్లాడబోయే అమ్మాయికి ఈ విషయం చెప్పడానికి కిందా మీదా అయ్యాడు. అలాంటిదిపుడు ఎంచక్కా షర్ట్ తీసి బీచుల్లో చక్కర్లు కొడుతున్నాడు. అతని వీపును చూసి తెగ ఫొటోలు తీసేసుకుంటున్నారు మిగతా వాళ్లు. ఏం చేశాడంటే వీపునే కేన్వాసు చేసుకుని అమెరికా జెండాను, కొండల మాటున సూర్యుణ్ని ఇలా తనకు నచ్చిన వాటి రూపంలో జుట్టును ట్రిమ్ చేయించు కుంటున్నాడు. అతడి మిత్రుడు టైలర్ హార్డింగ్ ఈ చిత్రాల్ని కత్తిరిస్తాడు. వాటిని నెలల పేర్లకు మ్యాచ్ అయ్యేలా చూసుకుని కేలండర్‌ను కూడా రిలీజ్ చేసేశారు.

ఈ గ్రామం.. వ్యర్థ రహితం

చెత్తనంతా కలిపి ఊరి చివరనో, చెరువుల్లోనో కుప్పలా పోయడం, అది కలుషితమై రోగాలు రావడం, పర్యావరణం పాడవడం ఇదో సైకిల్. దీనికి పరిష్కారం రీసైకిల్. వాడిన వస్తువులను చెత్తలో పారేయడం కంటే మరో రకంగా పనికి వచ్చేలా చేయడం అంటే పర్యావరణానికే కాదు ఆరోగ్యానికి, ఆర్థికానికి కూడా చాలా మేలు చేసినట్టే. దీన్నే ఆచరణలో పెట్టింది జపాన్‌లోని కామికట్సు గ్రామం 2003 నుంచి. సుమారు 80 శాతం వాడేసిన వస్తువుల్ని వారు తిరిగి ఉపయోగంలోకి తెస్తూ 2020 కల్లా జీరో వేస్ట్ గ్రామంగా చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. 1700 మంది ఉండే ఆ గ్రామంలో ఇదివరకు చెత్తను ఓ కుప్ప చేసి మంట వేసేవారు. దీని వల్ల అక్కడ నదీపాయలు, అడవి దెబ్బతినేవి. అదే ఇప్పుడు 34 రకాల వస్తువులుగా చెత్తను వేరు చేసి దగ్గరలోని కురు కురు మార్కెట్‌కు పంపుతారు. వీటికి బదులుగా కొత్త వస్తువులను తీసుకోవచ్చు అక్కడ. చాలా శ్రమతో కూడుకున్న ఈ ప్రక్రియ వల్ల తొలుత గృహిణులు వ్యతిరేకించారు. కానీ అది అలవాటయ్యేసరికి తేలికగానే అనిపిస్తోందని చెబుతున్నారు. కేవలం ఏదో డస్ట్ బిన్నుల్లో వేసినట్టు వస్తువుల్ని విసిరేయడం కాదు. ప్రతి వస్తువును శుభ్రం చేయాల్సి ఉంటుంది. దీని వల్ల కొత్తగా కొనేవాటి విషయంలో కాస్త తగ్గుతారు. ఇలాను చెత్త నియంత్రణ అవుతుంది. ఈ ఊరి విజయాన్ని ప్రపంచమంతటా విస్తరించేందుకు అక్కడ ఓ అకాడెమీ కూడా ఉంది. అది చెత్త నిర్వహణపై పాఠాలు చెబుతుంది. వీటిని నేర్చుకునేందుకు ఏటా 2500 మంది వస్తుంటారు.

వింతలోకం

తాబేళ్ల రక్షకుడు...

ఓ చిన్న పని ప్రపంచాన్ని కదిలిస్తుందా? అనే సందేహం వుంటే ఆరన్ కల్లింగ్ కథ తెలుసుకోవాలి. న్యూజిలాండ్‌కు చెందిన ఆరన్ తన సహచరుడితో ఓ సారి ఫుడ్ మార్కెట్‌కు వెళితే అక్కడ మెజెస్టిక్ తాబేళ్లను అమ్ముతున్న వాళ్లు కనిపించారు. వెంటనే వాటిని కొనేసి తిన్నగా వంటింటికి తీసుకెళ్లలేదు. 5 కి.మీ. దగ్గరలోని సముద్రానికి తీసుకెళ్లి విడిచిపెట్టేశారు. ఫొటోలు తీసి ఫేస్‌బుక్‌లో పెట్టారు. దయచేసి ఇలా జిహ్వా చాపల్యానికి అరుదైన జీవరాశుల్ని బలి చేయకండి అంటూ రిక్వెస్ట్ చేశారు. ఇలా అంతకు ముందు పదిసార్లు తాబేళ్లను రక్షించారు మిత్రులిద్దరూ. ఈ వీడియో 90 వేల షేర్లను అందుకుంది. అతడు చేసింది చాలా గొప్ప పని అని వేలాది కామెంట్లు వచ్చాయి. ఇదంతా ఆరన్‌కు ఆశ్చర్యంగా అనిపించింది. ఇంత స్పందన వస్తుందని ఊహించని ఆరన్ అదే ప్రోత్సాహంతో ముందుకు కదిలాడు. 'టర్టిల్ పవర్' అనే వేదికను ఏర్పాటు చేసి తాబేళ్లను తినడాన్ని నిషేధించడం, ఫుడ్‌జోన్లలో అమ్మేవాటిని సేకరించి తిరిగి సముద్రంలో విడిచిపెట్టడంపై కార్యకలాపాల్ని మొదలెట్టాడు. ఇతడికి మద్దతుగా చాలా మంది ముందుకు వస్తున్నారు. కొందరు ధన సాయం, కొందరు చేసాయం అందిస్తున్నారు.

చక్కిడాలు

కావలసినవి
వరిపిండి -1కిలో
పెసరపప్పు -150 గ్రాములు
వాము -25 గ్రాములు
నీళ్లు -తగినన్ని
నూనె -1 కిలో
ఉప్పు -తగినంత

తయారుచేసే విధానం
బియ్యాన్ని ముందు రోజు నానబెట్టి మరునాడు మెత్తగా పిండి పట్టించుకోవాలి. తరువాత పెసర పప్పును వేయించి మెత్తగా పొడి చేసుకోవాలి. ఈ పొడిని బియ్యప్పిండిలో కలుపుకోవాలి. ఇందులోనే తగినంత వాము, వంద గ్రాముల నూనె, తగినంత ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. దీన్ని గుండ్రంగా చెక్కిడాలుగా చుట్టి ఒక బట్ట మీద పెట్టుకోవాలి. ఇవి కొద్దిగా ఆరిన తరువాత స్టౌ మీద వెడల్పాటి మూకుడు పెట్టి సరిపడా నూనె వేసుకోవాలి. ఆరిన చెక్కిడాలను కాగిన నూనెలో వేసి బంగారు రంగు వచ్చేవరకూ వేయించుకోవాలి.

అరిసెలు

కావలసినవి
బియ్యం -1 కిలో
బెల్లం -అరకిలో
నువ్వులు -50 గ్రాములు
నూనె -తగినంత

తయారు చేసేవిధానం
ఒక రోజు ముందు బియ్యాన్ని నానబెట్టుకోవాలి. నానబెట్టిన బియ్యాన్ని పిండి పట్టించి జల్లించి పెట్టుకోవాలి. ఇప్పుడు పొయ్యి వెలిగించి వెడల్పాటి గిన్నె పెట్టుకుని బెల్లం సరిపడా నీళ్ళు పోసుకుని తీగ పాకం పట్టుకోవాలి. అందులో ఈ పిండిని వేసి బాగా కలిపి దించేయాలి. తరువాత కడాయి పెట్టుకుని నూనె పోసి బాగా కాగనివ్వాలి. దీన్లో కలిపి పెట్టుకున్న పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకుని అరిటాకుపై ఒత్తుకుని నూనెలో వేసి రెండు వైపులా కాలి ఎరుపు రంగు వచ్చాక తీసేయాలి. ఒక ప్లేటులో నువ్వులు వేసి అందులో వీటిని వేయాలి. అంతే నువ్వుల అరిసెలు రెడీ.

కజ్జికాయలు

కావలసినవి
మైదా -500 గ్రాములు
నెయ్యి -100 గ్రాములు
ఉప్పు - తగినంత
చక్కెర -350 గ్రాములు
కొబ్బరి తురుము - రెండు కప్పులు
గసగసాలు -100గ్రాములు
పుట్నాల పప్పు -150 గ్రాములు
యాలకులు -5 గ్రాములు
నూనె -తగినంత

తయారు చేసే విధానం
మైదాపిండిని జల్లించి అందులో ఉప్పు, నెయ్యి వేసి నీళ్ళతో పూరీల పిండిలా కలుపుకోవాలి. ఒక బాణలిలో తురిమిన కొబ్బరి వేసి సన్నని మంట మీద వేయించుకోవాలి. అందులో పుట్నాల పప్పు పొడి, గసగసాలు, చక్కెర వేసి బాగా వేయించి స్టౌ మీద నుండి దింపి, యాలకుల పొడి కలిపి పక్కన పెట్టుకోవాలి. ముందుగా కలిపి పెట్టుకున్న మైదాను చిన్న చిన్న ముద్దలుగా చేసుకొని వాటిని పూరీల్లా వత్తాలి. దాని మధ్యలో కొబ్బరి తురుము, పుట్నాల పప్పు మిశ్రమాన్ని రెండు స్పూన్లు వేసి మధ్యకు మడవాలి. అర్ధ చంద్రాకారంలో వచ్చిన తర్వాత వాటి చివరలను తడి చేసి మడత మీద మడత వేసి వేళ్ళతో గట్టిగా అదమాలి. ఈ విధంగా చేస్తే లోపలి మిశ్రమం బయటికి రాదు. ఇలా తయారుచేసిన కజ్జికాయలను కాగిన నూనెలో ఎర్రగా వేయించుకోవాలి.

నాటుకోడి కూర

కావలసినవి
నాటు కోడి మాంసం -1 కేజి
జీడిపప్పు -100 గ్రాములు
నూనె -100 గ్రాములు
పచ్చి మిర్చి -50 గ్రాములు
టమోటాలు -పావుకేజీ
ఉల్లిపాయలు -100 గ్రాములు
అల్లం వెల్లుల్లి పేస్ట్ -50 గ్రాములు
పసుపు -చిటికెడు
ఉప్పు -తగినంత
ధనియాల పొడి-2టీ స్పూన్లు
ఏలకులపొడి -చిటికెడు
కొత్తిమీర -2టీ స్పూన్లు

తయారుచేసే విధానం
మాంసం ముక్కలకు కారం, పసుపు, ధనియాల పొడి పట్టించాలి. జీడిపప్పులో కొద్దిగా నీళ్ళు పోసి ఉడికించి చల్లారిన తర్వాత ముద్దగా చేయాలి. స్టౌ వెలిగించి గిన్నె పెట్టి నూనె వేడి చేసి అందులో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్, టమోటా ముక్కలు, కోడి మాంసం వేసి ఉడికించుకోవాలి. ముక్క కొద్దిగా ఉడికిన తర్వాత జీడిపప్పు ముద్ద వేసి కొద్దిగా నీళ్ళుపోసి కలిపి ఉడికించాలి. కూర ఉడికిన తర్వాత దించే ముందు గార్నిష్ కోసం కొంచెం కొత్తిమీర వేయాలి.

ఆకులతో బొమ్మ

బంటీ కొన్ని ఆకులను తీసుకుని వాటితో ఒక ఏనుగు బొమ్మను తయారు చేశాడు. మరి మీరు కూడా ఆకులు సేకరించి ఇష్టమైన బొమ్మను తయారు చేస్తారు కదూ.



దారి కనుక్కోండి



అసలు నీడ

ఈ చిత్రంలో ఒక కారు ఉంది కదూ. అయితే కారు సరైన నీడను గుర్తించండి.



బుజ్జి స్టార్

ఇది నా చిన్ననాటి ఫోటో ఇప్పుడు నేనొక పెద్ద హీరోని. ఇంతకీ నేనెవర్నో చెప్పుకోండి?

పదాలు పూరిద్దాం

ఈ చిత్రంలోని బొమ్మలకు ఎదురుగా వాటి పేర్లను ఇచ్చాం. అయితే అందులోని ఖాళీలను పూరిస్తే సరైన పదం అవుతుంది.


sun_lass_s

se_she_l


s_n

be_ch

మొత్తం ఎన్ని?

మన జాతీయ జంతువు పులి. ఇంతకీ... ఈ చిత్రంలో మొత్తం ఎన్ని పులులు ఉన్నాయో... వాటిని గుర్తించి సున్నా చుట్టండి.

జవాబు:
పదాలు పూరిద్దాం : ge,al,u,a
మొత్తం ఎన్ని?: 16
బుజ్జి స్టార్: కార్తీక్

కత్తి దంతం నార్వాల్

ముఖానికి కొమ్ముతో కనిపించే జంతువులు నేల మీదే ఉంటాయని అనుకుంటున్నారా? సముద్రాల్లోను ఆ తరహా జంతువులున్నాయని నార్వాల్‌ను చూస్తే తెలుస్తుంది. పొడుగ్గా కత్తిలా పొడుచుకువచ్చినట్టుండే అది నిజానికి కొమ్ము కాదు దాని దంతం. అచ్చు ఏనుగుల్లా బయటకు పెరిగిన దంతం లాంటిది. పై పెదవి నుంచి వచ్చిన అది కాక మరో చిన్న దంతం మాత్రమే ఉంటుంది. మరి పళ్లు లేకుండా ఇది ఆహారం ఎలా తీసుకుంటుంది అనుకుంటున్నారా. చేపల్ని గబుక్కున మింగేసి బొజ్జ నింపుకుంటుంది. గమ్మత్తుగా ఉండే ఈ నార్వాల్స్ గురించి మరిన్ని విశేషాలు ఇవిగోండి...

- నార్వాల్స్ కేవలం ఆర్కిటిక్ సముద్ర జలాల్లో మాత్రమే కనిపిస్తాయి.
- నార్వే, రష్యా, కెనడా, గ్రీన్‌ల్యాండ్ తదితర దేశాల కిందకు వచ్చే సముద్రంలో ఇవి ఉంటాయి.
- క్షీరదాలైన నార్వాల్‌లు 50 ఏళ్లు జీవించగలవు. వీటి దగ్గరి బంధువులు బెలూగాలు, బాటిల్‌నోస్ డాల్ఫిన్లు, ఓర్కాలు (కిల్లర్ వేల్స్), హార్బర్ పోర్పాయిస్‌లు.
- పెద్దవి దాదాపు 15 అడుగుల పొడవుగా ఓ బస్సంత సైజులో ఉంటాయి. వాటి బరువు సుమారు 1500 కేజీలు ఉంటుంది.
- దంతం మరో పది అడుగులు ఉంటుంది. ఇంత ఉన్నా ఇది 10 కేజీల బరువే ఉంటుంది. ఎందుకంటే సర్పిలాకారంలో చుట్టలుగా పెరిగి లోపల బోలుగా ఉండటమే కారణం.
- ఎక్కువగా మగవాటికే ఈ పొడవాటి దంతాలు పెరుగుతాయి. కొన్నింటికి రెండు దంతాలు కూడా పొడవుగా పెరుగుతాయి.
- ఈ దంతాల మీద సుమారు కోటి నరాల కొసలు ఉంటాయి. వాటిని రుద్ది పక్కవాటితో మాట్లాడతాయి. సముద్ర జలాల్లోని మార్పులను కూడా వీటి సాయంతో పసిగడతాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.
- హాలిబట్, స్క్విడ్, ష్రింప్, చేపలే వీటి ఆహారం.
- వీటి కోసం రెండు మూడు కిలోమీటర్ల లోతుకు డైవ్ చేసి వాటిని వెతుకుతాయి.
- చలికాలంలో ఆర్కిటిక్ సముద్రం గడ్డకట్టి పోతుంది. అప్పుడు సుమారు 5 నెలల పాటు మంచు పొర కింద నీటిలో గడపాల్సి ఉంటుంది.
- కొన్ని ఆక్సిజన్ అందక చనిపోతుంటాయి. మరికొన్ని కోస్తా తీరాలకు చేరుకుని గుంపులుగా ఉంటాయి.
- మామూలు రోజుల్లో 2-10 వరకు ఓ జట్టుగా జీవిస్తుంటాయి.
- వీటికి బాగా ఇష్టమైన అలవాటు కరిగిపోతున్న మంచు ముక్కల్ని చప్పరించడం.
- వీటి ప్రధాన శత్రువులు వాల్‌రస్‌లు, ధ్రువపు ఎలుగుబంట్లు.
- గ్రీన్‌ల్యాండ్‌లో ఉండే ఇన్యుట్ తెగ మనుషులు వీటి చర్మం, దంతాల కోసం వీటిని దారుణంగా చంపేస్తుంటారు.
- ఇవి ఇప్పుడు కేవలం 80 వేలు మాత్రమే మిగిలి ఉన్నాయి. అంతరించే పోయే దశలో ఉన్నాయి.



విజ్ఞాన వినోదాల ఈసప్ కథలు

ఈరోజుల్లో ఎవర్ని చూసినా ... పొద్దున లేచింది మొదలు ఉరుకులు పరుగులే. పైగా అమ్మమ్మ తాతయ్యలు ఇళ్లల్లో వుండే అవకాశం లేదు కనక చిన్నారులకు కథలు చెప్పేవారే కరవయ్యారు. టీవీలు, వీడియో గేమ్స్లు పుణ్యమా అని పిల్లలు సైతం కథలు చెప్పమని అడగడమే తగ్గిపోతోంది. పొరపాటున ఎవరైనా పిల్లలు కథ చెప్పమని నోరు తెరిచి అడిగితే... చెప్పడానికి కథలే గుర్తు రాని పెద్దలూ తక్కువ కాదు. ఎలాగోలా గుర్తు తెచ్చుకుని ఏదో ఒక కథ చెప్పాక అందులోంచి ఏవైనా ప్రశ్నలు వేస్తే... వాటికి సరైన సమాధానం చెప్పడం కూడా కష్టమౌతోంది. ఈ బాధలన్నీ గ్రహించారు కాబట్టే కె.రామలక్ష్మి పిల్లల్లో విజ్ఞానాన్ని, వినోదాన్ని పెంచేందుకు గ్రీకు కథకుడు ఈసప్ చెప్పిన కథలను మూడు సంపుటాలుగా తేలిక పదాలతో పొందుపరిచారు. ఈ మూడు పుస్తకాల్లోని కథల్లో మనకు కనిపించేవన్నీ సింహం, పిల్లి నక్క, గాడిద, తోడేలు, కాకి, నెమలి, కోతి వంటి అడవి జంతువులే. ఈ కథలు చదువుతుంటే వాటికి అంత తెలివి వుంటుందా? ఇవన్నీ నిజంగా జరిగాయా? అనే అనుమానం పిల్లలకి రాకమానదు. ఇందులోని కథలు కల్పితాలే అయినా అవి మనుషుల స్వభావాలకి, జీవితాలకి దగ్గరగా వుంటాయి. ఒక్కో కథా మన స్వభావాన్ని బట్టి, ఒక్కో సందర్భంలో మనల్ని హెచ్చరిస్తుంటాయి. మన తప్పులు ఎత్తి చూపుతుంటాయి. అవే తప్పులు చేయకుండా వారిస్తుంటాయి. ప్రమాద సమయాల్లో ఎలా వ్యవహరించాలో చెప్పకనే చెప్తాయి. పేర్లలో కాకి, టక్కరి నక్క, పిరికి పిల్లి ఇలా ఎన్ని ఉన్నా అవి మన స్వభావాలే! ఈ ఈసప్ కథల పుస్తకాల్లో మొదటి పుస్తకం మనం తోటి వారితో ఎలా మెలగాలో సూచిస్తుంది. అందుకు నక్క-వేటగాడు, నక్క అడుగుజాడలు, కుక్క-మాంసం ముక్క కథలు. మన తెలివి తక్కువతనానికి, అత్యాశకి పరిణామాలు ఎలావుంటాయో ఈ కథలు చెబుతాయి. ఇక రెండో పుస్తకంలో.. మనకు కష్టించకుండా ఏదీ రాదని, శ్రమ చేస్తే వచ్చే ఆనందం మనల్ని ఉన్నత స్థానంలో నిలబెడుతుందని బోధించే నీతి కథలు, ఎవరు ఏం చెప్పినా వినేయకుండా విచక్షణతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని హెచ్చరించే కథలే. ఆశపోతు నక్క, తోడేలు-గొర్రె. ఇలాంటి కథలు ఇంకెన్నో. మూడో పుస్తకం తోటివారి స్వభావాన్ని గుర్తించకుంటే ప్రమాదం తప్పదనే నీతిని, వివిధ సందర్భాల్లో ఈ జంతువుల మధ్య జరిగే సంభాషణల ద్వారా చక్కగా చెప్పారు పిల్లల కథల ఎక్స్‌పర్ట్ కె. రామలక్ష్మి. ఇవి పిల్లల కథల పుస్తకాలుగా అనిపించినా పెద్దలకూ ఎంతో విజ్ఞానాన్ని పంచుతాయి. కథలకు తగ్గ బొమ్మలు చిన్నారులను మరింత ఆకట్టుకుంటాయనడంలో సందేహం లేదు.

- శార్వాణి



ఈసప్ చెప్పిన కథలు – 3 భాగాలు, ఒక్కో పుస్తకం వెల: 25/-, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలు.

◆ కొత్త పుస్తకాలు



గుడిసె గుండె
దేవరాజు మహారాజు
వెల:60/-
పేజీలు:66/-
ప్రతులకు:అన్ని ప్రముఖ షాపులల్లో లభించును



పూవులు సమ్మె చేస్తాయి
ఏటూరి నాగేంద్రరావు
వెల:70/-
పేజీలు:79/-
ప్రతులకు: అన్ని ప్రముఖ షాపులల్లో లభించును

భావోద్వేగాలకు భాషాంతరీకరణ

ఈ సంపుటిలో మొత్తం పదహారు కథలున్నాయి. అన్నీ విదేశీ కథలే. పైగా రాసినవారంతా చెయ్యి తిరిగిన రచయిత్రులే. ఒక్కొక్కరిది ఒక్కో శైలి. వీరిలో నోబెల్ బహుమతి గ్రహీతలున్నారు. స్త్రీవాదులుగా, హృదయ వాదులుగా రచనను వేదికగా చేసుకొని 1907 నుంచీ ఆలోచనాత్మక రచనలు చేసినవారున్నారు. రష్యన్, స్వీడిష్, ఉక్రెయిన్, వియత్నాం, జపనీస్, లెబనాన్, పోలిష్, అమెరికన్, ఇంగ్లీషు భాషల కథలకు అనుసృజనే అయినా తెలుగులో చదువుతున్న భావన కల్గించారు రంగనాథ రామచంద్రరావు. ప్రతి కథలోనూ ప్రతి వాక్యంలోనూ, ప్రతి అక్షరంలోనూ ఆయా దేశ ప్రజల సంస్కృతి సంప్రదాయాలు, ప్రతిబింబిస్తుంటాయి. ఒంటరితనం, బీదరికం, ప్రేమ రాహిత్యం, యుద్ధాలు మిగిల్చిన విషాదాలు, విద్రోహ, విరోధ ద్వేషాలు సృష్టించిన దారుణాలు, చిన్ని ఆశారేఖలు, భ్రమలు, బలహీనతలు, నిస్సహాయత, మనసుని చితక్కొట్టే మోసాలు, నాజూకు భావనల్ని నలిపేసే నయవంచన. వెంటాడి వేటాడే శాడిజం, దోపిడీకి, దురాగతాలకి, వివక్షలకి పలు పార్శ్వాలు ఈ కథలు. వీటన్నిటికీ బలి తల్లులు, పిల్లలు. దేశం ఏదైనా సుఖదు:ఖాలు, కష్టసుఖాల సమతూకం ఒకటేనేమో! అనిపించే జీవితాలకు దర్పణం ఈ చిన్ని కథలు. మొత్తంగా ఆర్ద్రత నిండిన అతివల (కొందరు పురుషుల) అంతరంగ చిత్రణ 'ఓ నగరం కథ'. కారుణ్యం నిండిన కథనాలను ఎంపిక చేసుకోవడం అనువాదకుడి కరుణాంతరంగానికి ప్రతీక. కఠిన జీవిత వాస్తవాలను ప్రతిబింబించే భాషకందని భావోద్వేగాలను భాషాంతరీకరణ ద్వారా భావాంతరీకరించడంలో అనువాదకుని కృషి అర్ధమౌతుంది. వివిధ పత్రికల్లో అచ్చయిన ఈ కథల్ని సంపుటిగా తీసుకురావడం మంచి విషయం.

- స్నేహ

ఒక నగరం కథ (ప్రపంచ ప్రసిద్ధ రచయిత్రుల విశిష్ట కథా సంకలనం), అనుసృజన– రంగనాథ రామచంద్రరావు, పేజీలు: 135, వెల: 95/-, ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలు.

మోడల్ బామ్మ

అమ్మమ్మ అంటే మనవరాలికి అమ్మ కన్నా ఎక్కువ. టీనేజీలోను గారాలు పోడానికి, పెళ్లయ్యాక కూడా అమ్మను ఆట పట్టించడానికి. పసిగుడ్డుగా ఉన్నప్పుడు ఎలా కంటికి రెప్పలా చూసుకుని మురిసిపోయేదో ... ఏళ్లొచ్చాక కూడా అలానే చంటి పిల్లల్లా అక్కున చేర్చుకునేది అమ్మమ్మే కదా. అమ్మకు ఎలా ఎత్తుకోవాలో రాకుంటే.. ఒంటి బరువు తీరేలాగా నలుగు పట్టి స్నానాలు చేయిస్తుంది, ప్లాస్టిక్ సర్జరీల అవసరం రాకుండా ముక్కును దిద్దుతుంది.. తలను అద్దుతుంది. ఆవలింతలు వచ్చేదాకా కంటి మీది కునుకుతోను అర్ధరాత్రుళ్లు లాలిపాటలు పాడుతుంది. అందుకే అందరిలానే చినామి మోరీకి అమ్మమ్మ అంటే చాలా ఇష్టం. ఆ ఇష్టాన్ని చాలా ప్రత్యేకంగా వ్యక్తపరుస్తూ అందర్నీ ఆకట్టుకుంటోంది. 93 ఏళ్ల వయస్సులోను స్టుడియోలో హుషారుగా కలియతిరుగుతూ అందర్లో జోష్ పెంచే తన ఫన్నీ అమ్మమ్మ ఎమికోను తన ఫ్యాషన్ బ్రాండింగ్‌కు, ఫొటోగ్రఫీకి కూల్ మోడల్‌ను చేసింది. జపాన్ ఫ్రీస్టైల్ అల్లిక కళ సావొరీతో చేసిన దుస్తులకు అమ్మమ్మనే మోడల్‌గా ఎంచుకుంది. ★

రాతి కట్టు'బడి'

రాయిపై రాయి పేర్చి మహా అయితే కూలిపోయే గోడ కట్టేస్తారు. కానీ జానీ క్లాస్పర్ మాత్రం అలా కాదు. అతడి స్కూల్లో అలాంటి రాతి కట్టుబడి అంటే అది చెక్కని శిల్పమే. ఆ రాతి కూర్పుతోనే శిల్పాలు చేసేస్తాడు. యూకేలోని యార్క్‌షైర్‌కు చెందిన క్లాస్పర్‌కు చిన్నప్పటి నుంచి మట్టి వాసన అన్నా, రాళ్ల గలగలలన్నా తెగ ఇష్టం. ఏం చదువుతావు అని ఇంట్లో అడిగితే 'ఇటుక ఇంజినీర్ అవుతా' అని చటుక్కున చెప్పేశాడు. ఎంత సేపు రాళ్లూ, రప్పలు జేబుల్లో నింపుకుని ఏదో కడుతుంటే పెద్దయ్యాక వీడేమవుతాడో అని టెన్షన్ పట్టుకుంది తల్లిదండ్రులకు. కానీ తాను అనుకున్నట్టే ఇటుకల తయారీ కోర్సును పూర్తిచేశాడు. రాళ్ల నిర్మాణంపై పట్టు సాధించాడు. గులక రాళ్లు, బండరాళ్లను పేర్చి వివిధ ఆకృతుల్లో పేషియోలు చేయడం పనిగా పెట్టుకున్నాడు. ఇవే కాదు రాళ్ల రంగుల్లోని తేడాల్ని పట్టి మొజాయిక్ మ్యాజిక్‌ను సృజించాడు. ఇలా కూడా రాళ్లను పేర్చొచ్చా అని సంశయం... ఆ తర్వాత అతిశయం... వెంట వెంటనే వచ్చే రియాక్షన్స్. ఒక్కరాయిని పట్టుకుంటే మొత్తం నిర్మాణమంతా కూలిపోతుందేమో అన్నంత నాజూగ్గా కనిపించినా అవి చెక్కు చెదరవు. ఇక ఇటుకలతో వేసే దారి హద్దుల్లో కళకు హద్దంటూ ఉండదు. దారులన్నీ కలిసి వలయంలోకి మాయమైనట్టు, దారి కట్టు మీద మరో కట్ట నిలిచినట్టు ... అంతా వింతే. ★